

పుత్తూరు కాపు వీధి కూడలిలో ప్రజాగళం సభకు పోటెత్తిన జనం - టీడీపీ నగరి అసెంబ్లీ అభ్యర్థి గాలి భానుప్రకాష్, చిత్తూరు ఎంపీ అభ్యర్థి ప్రసాదరావులను చూపించి గెలిపించమని కోరుతున్న చంద్రబాబు

జబర్దస్త్ రోజా నగరికి ఏం చేశారు?

ఎలక్ట్రానిక్ క్లస్టర్‌కు భూములిస్తే నగరి, తిరుపతి ఎమ్మెల్యేలు దోచేశారు

ఇండస్ట్రియల్ పార్కుకు 1500 ఎకరాలిస్తే ఒక పరిశ్రమైనా పెట్టారా?

ప్రజాగళం సభలో నిప్పులు చెరిగిన చంద్రబాబు

పుత్తూరు అర్బన్, మార్చి 27 : జబర్దస్త్ ఎమ్మెల్యే నగరి నియోజకవర్గ అభివృద్ధికి ఏమైనా చేశారా అంటూ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూటిగా ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం పుత్తూరులో జరిగిన ప్రజాగళం బహిరంగసభలో ఆయన ప్రసంగిస్తూ వడమాలపేట మండలంలో ఎలక్ట్రానిక్ క్లస్టర్ కోసం గత ప్రభుత్వంలో తాము 150 ఎకరాల భూములు కేటాయిస్తే నగరి, తిరుపతి ఎమ్మెల్యేలు డబ్బు కొట్టేసి పాదిరేడు అరణ్యాన్ని దోచుకున్నారని ఆరోపించారు. విజయపురం మండలంలో ఇండస్ట్రియల్ పార్కు కోసం గతంలో తమ ప్రభుత్వం 1500 ఎకరాల భూములు కేటాయిస్తే ఈ ఐదేళ్లలో కనీసం ఒక పరిశ్రమైనా పెట్టారా? ఒక ఉద్యోగమైనా ఇచ్చారా? అంటూ నిలదీశారు. చెన్నైకి కేవలం 60 కిలోమీటర్ల దూరంలో వున్న ఈ ప్రాంతంలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తే చదువుకున్న యువత ఉపాధి కోసం తమిళనాడు వెళ్ళకుండా స్థానికంగానే ఉద్యోగావకాశాలు పొందుతారన్న దూరదృష్టితో భూములు కేటాయిస్తే పరిశ్రమలను రప్పించడంలో వైసీపీ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని దుయ్యబట్టారు. గాలేరు-నగరి సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేస్తామని, నగరిలో చేనేత కార్మికులకు 500 యూనిట్లు ఉచితంగా విద్యుత్ అందిస్తామని ఇక్కడి నుంచే హామీ ఇచ్చిన వైఎస్ జగన్ హామీ ఏమైందని ప్రశ్నించారు. గాలేరు-నగరి ప్రాజెక్టు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, వేణుగోపాల సాగర్ ప్రాజెక్టు పనులు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి ఇస్తామని ఎమ్మెల్యే తన నుంచీ రూ. 40 లక్షలు తీసుకుని మోసగించారంటూ భువనేశ్వరి అనే అమ్మాయి తన వద్దకు వచ్చి ఆవేదన వ్యక్తం చేసిందని చెబుతూ వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్ అయిన భువనేశ్వరిని వాహనంపైకి పిలిపించారు.ఆమెను ప్రజలకు చూపిస్తూ ఇలాంటి ఆడబిడ్డను మోసగించిన వారికి ఓటేస్తారా అంటూ ప్రశ్నించారు. మోసపోయిన ఆడబిడ్డకు అండగా వుంటారా లేదా అని ప్రశ్నించారు. ఇలాంటి ఎమ్మెల్యేలను ప్రోత్సహించిన జగన్‌ను కూడా గుర్తు పెట్టుకోవాలని ప్రజలకు పిలుపిచ్చారు. నగరి నియోజకవర్గంలో ఎక్కడ చూసినా గ్రావెల్ వంటి వనరుల దోపిడీ జరుగుతోందని, నియోజకవర్గమంతా అరాచకం నెలకొన్నదని ఆరోపించారు.

మండుటెండలో సైతం తరలివచ్చిన అశేష జనం

పుత్తూరు పట్టణం కాపు వీధి కూడలిలో నిర్వహించిన ప్రజాగళం బహిరంగసభకు జనం పోటెత్తారు. మిట్టమధ్యాహ్నం మండుటెండలో సైతం మహిళలు, వృద్ధులు, పిల్లలు అనే తేడా లేకుండా పార్టీ కార్యకర్తలతో పాటు సామాన్య జనం కూడా తరలి రావడంతో పట్టణం కిక్కిరిసిపోయింది. జన స్పందన చూసి చంద్రబాబు సంతృప్తి చెందగా స్థానిక టీడీపీ నేతలు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.ప్రజాగళం రోడ్‌షో, సభ విజయవంతం కావడం పట్ల చంద్రబాబు నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. చంద్రబాబు సభావేదిక మీదకు రాగానే భానుప్రకాష్ ఆయనకు కరవాలం బహూకరించగా, చంద్రబాబు కత్తిని దూసి యుద్ధానికి సిద్ధమని సింబాలిక్‌గా చూపారు. దీంతో కార్యకర్తల ఈలలు, కేకలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది.

పేదల మనిషి ముద్దుకృష్ణమ

నగరి నియోజకవర్గం అంటేనే గాలి ముద్దుకృష్ణమ నాయుడు గుర్తుకొస్తారన్నారు చంద్రబాబు . తన మిత్రుడైన ముద్దుకృష్ణమ పేదల మనిషిగా పేరుపడ్డారని కొనియాడారు. నగరిలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఎన్నోసార్లు తన వద్ద ప్రస్తావించారని గుర్తు చేసుకున్నారు. నగరిలో టెక్స్‌టైల్ ఇండస్ట్రీ వున్నందున దానికి సంబంధించిన పార్కు ఏర్పాటు చేస్తామని తద్వారా యువత స్థానికంగానే ఉద్యోగాలు పొందే పరిస్థితి సృష్టిస్తామన్నారు. చేనేత, మరమగ్గాల కార్మికులకు 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. చేనేత కార్మికులకు మేలు చేసే విధంగా ప్రత్యేక ప్యాకేజీ రూపొందించి అమలు చేస్తామన్నారు. వేణుగోపాల సాగర్ ప్రాజెక్టు పూర్తి చేయించి నగరి నియోజకవర్గంలో ప్రతి ఎకరానికీ సాగునీరందిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. నగరి, పుత్తూరు పట్టణాల్లో ప్రజల దాహార్తి తీర్చడానికి సమ్మర్ స్టోరేజీ ట్యాంకులున్నాయని, అయితే వాటిలోకి నీరు రావడం లేదన్నారు. వాటిని కూడా పూర్తి చేస్తామన్నారు. ఎన్టీఆర్ తిరుమలలో భక్తులకు అన్నదానం ప్రవేశపెట్టారని, అయితే టీటీడీ ఇపుడు దాన్ని సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. అలాగే తాను సీఎంగా వుండగా స్విమ్స్‌లో ప్రాణదాన పథకం పెట్టానని, దాన్ని నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే వాటిని సరిదిద్దుతామన్నారు.నగరి నియోజకవర్గం పుత్తూరులో ప్రజాగళం బహిరంగసభ చూస్తే సీఎం జగన్‌కు మైండ్ బ్లాంక్ అవడం ఖాయమన్నారు. బహిరంగసభలో నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కౌన్సిలర్లు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ అంకయ్య

పుత్తూరు మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లతో పాటు మాజీ ఛైర్మన్ అంకయ్య బుధవారం టీడీపీలో చేరిపోయారు.చంద్రబాబు సమక్షంలో 17వ వార్డు కౌన్సిలర్ భువనేశ్వరి, 11వ వార్డు కౌన్సిలర్ జాన్ కెనడీతో పాటు మున్సిపల్ మాజీ ఛైర్మన్ అంకయ్య, రిటైర్డ్ టీచర్, అంబేడ్కర్ ట్రస్ట్ భవన్ కోశాధికారి కుప్పయ్య తదితరులు నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి చిన్నరాజుకుప్పం హెలిపాడ్ వద్ద చంద్రబాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (గురువారం) : సా. 6.27
సహరి (శుక్రవారం) : ఉ. 4.52



జన్మదినాన శ్రీవారి సేవలో

తిరుమలేశుడిని బుధవారం ఉదయం హీరో రామ్‌చరణ్ తన భార్య ఉపాసన, కుమార్తె క్లీంకారతో కలిసి దర్శించుకున్నారు.పుట్టినరోజును పురస్కరించుకుని తిరుమలకు వచ్చిన ఆయన సుప్రభాత సేవలో పాల్గొన్నారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

తాళపత్ర గ్రంథాల రక్షణను దేశవ్యాప్తం చేయాలి

- సీజేఐ డీవై చంద్రచూడ్ -



తిరుపతి రూరల్, మార్చి 27 : కొన్ని వేల సంవత్సరాల కిందటే మహర్షులు, రుషులు, పెద్దలు ఎంతో విజ్ఞానాన్ని, శాస్త్ర సాంకేతిక అంశాలను నిక్షిప్తపరచిన రాతప్రతులను (మాన్యుస్క్రిప్ట్స్) భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిమీదా ఉందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ డీవై చంద్రచూడ్ తెలిపారు. తిరుపతి పర్యటనకు వచ్చిన సీజేఐ బుధవారం ఎస్వీ వేదవర్సిటీని సందర్శించి టీటీడీ, వర్సిటీ ద్వారా సంరక్షిస్తూ డిజిటలైజేషన్ చేస్తున్న తాళపత్రాలను పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ అత్యంత పురాతనమైన తాళపత్ర గ్రంథాలను ఇక్కడ అద్భుతంగా సంరక్షిస్తున్నారని తెలిపారు. వర్సిటీలో ఉన్న పురాతన న్యాయశాస్త్ర గ్రంథాల గురించి తెలుసుకున్నట్లు చెప్పారు. పురాతన తాళపత్ర గ్రంథాల రక్షణ దేశవ్యాప్తంగా చేయాలని తెలిపారు. దీని ఫలితాలు విశ్వవ్యాప్తంగా మానవులందరి శ్రేయస్సుకు దోహదపడతాయని నమ్ముతున్నానని చెప్పారు. టీటీడీ ఇటువంటి వేదవర్సిటీని నడపడం గర్వించదగ్గ విషయమన్నారు. వేదమంత్ర పఠనం వింటుంటే మనస్సు చాలా ప్రశాంతంగా, ఆనందంగా ఉందని తెలిపారు.

టీడీపీ నాయకుడి ఇంట్లో ఐటీ తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 27 : టీడీపీ నాయకుడు కోడూరు బాలసుబ్రహ్మణ్యం ఇంటిలో బుధవారం సాయంత్రం ఆదాయ పన్ను అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో ఎలాంటి నగదు, రికార్డులు దొరకలేదని సమాచారం. తిరుపతి నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి ఆయన ప్రయత్నాలు చేసిన నేపథ్యంలో ఆదాయ పన్ను శాఖ తనిఖీలు జరగడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తన తండ్రి కాలం నుంచి రాజకీయాల్లో ఉన్నామని, ఏదైనా ఉంటే ప్రజాక్షేత్రంలో చూసుకోవాలి కానీ, ఇలాంటి దాడులు తనను భయపెట్టలేవన్నారు. ఇంట్లో ఆడవాళ్లున్నారన్న విషయం కూడా మరచి 15మంది అధికారులు ఒక్కసారిగా ప్రవేశించి భయభ్రాంతులకు గురిచేయడం బాధాకరమన్నారు.

తవ్వేకొద్దీ బయటపడుతున్న వైసీపీ బండారం

● ఒక్కచోటే రూ.40కోట్ల ప్రచార సామగ్రి నిల్వ!



గోదాములో తనిఖీ చేస్తున్న అధికారులు

రేణిగుంట, మార్చి 27 : తిరుపతి విమానాశ్రయ సమీపంలోని ప్రైవేటు గోదాముల్లో వెతికే కొద్దీ వైసీపీ ఎన్నికల ప్రచారసామగ్రి బయటపడుతోంది.రేణిగుంట- శ్రీకాళహస్తి ప్రధాన మార్గంలో వున్న పీసీఆర్ గోదాముల్లో దాదాపు రూ.40కోట్ల పైచిలుకు విలువ చేసే ప్రచార సామాగ్రి బయటపడగా ఈ విషయంలో అధికార యంత్రాంగం వ్యవహరించిన తీరు అనుమానాలకు తావిచ్చేలా వుంది.పీసీఆర్ గోదాముల్లో భారీమొత్తంలో వైసీపీ ప్రచార సామాగ్రి వుందంటూ టీడీపీ నాయకులు ఎన్నికల అధికారులకు సీ విజిల్ యాప్‌లో మంగళవారం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి సలోమీ పోలీసు సిబ్బందితో కలసి మూడు గోదాములున్న ఆవరణను తనిఖీ చేయగా మినీ లారీ నిండా వైసీపీ ప్రచార సామగ్రి లోడ్ చేసి ఏలూరుకు తరలించేందుకు బయల్దేరుతూ కంటపడ్డారు. వాటిని కిందకు దింపి పరిశీలించగా వైసీపీ ప్రచార సామగ్రితో పాటు చీరలు, గొడుగులు, బొట్టుబిల్లలు, టవళ్ళు, టీ షర్టులు వంటివి బయటపడ్డాయి. వాటిని అధికారులు సీజ్ చేసి బిల్లులు వుంటే చూపాలని లారీ సిబ్బందిని ఆదేశించారు.రిటర్నింగ్ అధికారి సహా ఇతర అధికారులకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి సమాచారం అందించినా ఎవరూ రాలేదు. అప్పటికే సామాజిక మాధ్యమాల్లో ఈ వ్యవహారం వైరల్ కావడంతో పాటు ఎన్నికల కమిషన్‌కు పలు ఫిర్యాదులందాయి. దీంతో మంగళవారం రాత్రి తహసిల్దారు నాగేశ్వరరావు, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, సీఐలు మల్లిఖార్జున, సుబ్బరాయుడు పోలీసులతో కలసి అక్కడికి చేరుకున్నారు. గోదాము వెనుకవైపు షట్టర్ కాస్త తెరిచి వుండడంతో దాన్ని తెరిపించి లోపలకి వెళ్ళి పరిశీలించారు. భారీ ఎత్తున వైసీపీ ప్రచార సామగ్రి వుండడం కనిపించింది. వాటిని ప్రాథమికంగా రికార్డు చేసి సిబ్బందిని కాపలా వుంచి రాత్రి 10.30 గంటలకు అధికారులు వెనుదిరిగారు. మరో అరగంటకు చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ అక్కడకు చేరుకుని గోదాముల వద్ద బైఠాయించారు. నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వస్తువులు నిల్వ వుంచిందని, గోదాములకు సీల్ వేయకుండా అధికారులు ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రశ్నిస్తూ ఆందోళనకు దిగారు.ఈ క్రమంలో బుధవారం టీడీపీ నేతలు నరసింహ యాదవ్, బొజ్జల సుధీర్‌రెడ్డి, సుగుణమ్మ తదితరులు గోదాము వద్దకు చేరుకుని పట్టుబడిన వైసీపీ సామగ్రిని పరిశీలించారు.ఎన్నికల అధికారులు రాకపోవడం, పక్కనున్న రెండు గోదాములను తెరిచి తనిఖీ చేయకపోవడం చూస్తుంటే వైసీపీకి అనుకూలంగా ఈసీ పనిచేస్తోందా అన్న అనుమానం కలుగుతోందని ఘాటుగా విమర్శించారు.మిగిలిన రెండు గోదాములను తెరవాలంటూ అక్కడే బైఠాయించారు.పట్టుబడిన సామగ్రిని పరిశీలించేందుకు వచ్చిన కమర్షియల్ టాక్స్, జీఎస్టీ అధికారులను నిలదీశారు. ఈ గోదాముల్లోనే కాకుండా సమీపంలోని రెండు ప్రైవేటు కళాశాలల్లో ఓటర్లకు పంపిణీ చేసేందుకు భారీ మొత్తంలో మద్యం, చీరలు, ముక్కుపుడకలు, కమ్మలు నిల్వ చేశారని, వాటిని తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో, తహసీల్దార్లు కడప జిల్లాకు చెందిన వారని వీరితో పాటు ఎంపీడీవోలు, పోలీసుశాఖలో సీఐలు వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మధ్యాహ్నం వరకు కూడా పైస్థాయి అధికారులు రాకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్వో పెంచలకిషోర్, ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, తహసీల్దారు నాగేశ్వరరావు, ఎంపీడీవో విష్ణుచిరంజీవి, అర్బన్ సీఐ మల్లికార్జున్ గోదాము తాళాలను మీడియా సమక్షంలో తీశారు. ఇందులో 40 లారీల వైసీపీ ప్రచార సామాగ్రితో పాటు ఓటర్లను ప్రభావితం చేసే వాచ్‌లు, బొట్టుబిల్లలు, గొడుగులు, మొత్తం 52 రకాల వస్తువులు ఉన్నాయి. అలాగే పక్కనున్న మరో గోదామును అధికారులు తెరిచి పరిశీలించగా అందులో 15 లారీలకు సరిపడా సరుకు కన్పించింది.వైసీపీ అభ్యర్థులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలకు చెందిన క్యాలెండర్లు, డైరీలు, బ్యాగులు, ప్రచారానికి ఉపయోగించే మైకులను అధికారులు గుర్తించారు.వీటిని నియోజకవర్గాల వారీగా రోజుకు ఐదు లారీలు చొప్పున తరలిస్తున్నారని కూడా గుర్తించారు. కాగా గోదాములో ఉన్న సరుకు మొత్తం వైసీపీ ప్రచార సామగ్రి అని, విలువ లెక్కిస్తున్నామని ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఈ వివాదంపై వైసీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. గోదాముల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులుంటే జప్తు చేసుకోవచ్చన్నారు.ప్రచార సామగ్రికి సంబంధించి రసీదులు, బిల్లులు ఎన్నికల సంఘానికి సమర్పించామని చెప్పారు.రాజకీయ పార్టీ తమ ప్రచారంలో భాగంగా అన్ని అనుమతులతో కొనుగోలు చేసుకుని వాడుకునే సామగ్రికి ఎవరూ అడ్డుపడకూడదని కోరారు.



చెవిరెడ్డి కుటుంబ డైరీలు, ప్రచార మైకులు



గోదాములో సరుకును పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

దివ్యాంగుల కార్యాలయం ప్రారంభం



చంద్రగిరి, మార్చి 27: చంద్రగిరిలోని భారతీనగర్‌లో బుధవారం మునీశ్వరస్వామి డిజేబుల్డ్ హెల్పర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని (దివ్యాంగుల కార్యాలయం) ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మణికంఠ, చైర్మన్ ఉషారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంధుల లిపి సృష్టికర్త లూయిబ్రెయిన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వికలాంగులకే కాకుండా తమ సంస్థ ద్వారా వృద్ధులకు, అనాథలకు సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ కార్యదర్శి పూజ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ

భాకరాపేట, మార్చి 27: భాకరాపేటలో నిర్మించిన వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం వైభవంగా నిర్వహించారు. వేదపారాయణం, అర్చన, హోమాలు, నారీ సంధానం పూర్వక కళాహోమం, ప్రాణ ప్రతిష్ఠ, కాలన్యాస దర్పణం, మహా పూర్ణాహుతి కుంభాభిషేకం, మంత్ర పుష్ప మహా మంగళ హారతి అభిషేకం, ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు.టీడీపీ యువ నేత పులివర్తి వినీల్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



పాకాల, మార్చి 27: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు రెవెన్యూ సిబ్బందితో కలిసి బుధవారం ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పురవీధులలో ర్యాలీ నిర్వహించి ఆర్టీసీ బస్టాండు ఎదుట మానవహారం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ వాణిశ్రీ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన అందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. బాధ్యతగల పౌరులుగా అందరూ ఓటింగ్‌లో పాల్గొని నిర్భయంగా ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేంద్రబాబు, సీఐ రాజగోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా, డిప్యూటీ తహశీల్దార్ మోహన్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర, అధ్యాపకులు రమేష్ కుమార్, ఈశ్వరబాబు, మాశిలామణి, చిట్టికళావతి తదితరులు పాల్గొన్నారు.

దామలచెరువులో టీడీపీ ప్రచారం



పాకాల, మార్చి 27: దామలచెరువు పంచాయతీ పరిధిలోని కాకర్లవారిపల్లె, మొరవపల్లె, బండకాడపల్లె, పోలిశెట్టివారిపల్లెలలో బుధవారం టీడీపీ, జనసేన నాయకులతో కలిసి పులివర్తి నాని సోదరి ధనలక్ష్మి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. భావితరాల భవిష్యత్తుకోసం చంద్రబాబు పాలన అవసరమన్నారు. పులివర్తి నానికి ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇవ్వాలని కోరారు.

టీడీపీలోకి తుమ్మలగుంట వైసీపీ నేతలు



బాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్న తుమ్మలగుంట వైసీపీ నేతలు

తిరుపతి రూరల్,మార్చి27: చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో తుమ్మలగుంటకు చెందిన పలువురు వైసీపీ నేతలు బుధవారం మాజీ సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని నేతృత్వంలో గ్రామానికి చెందిన సాహిత్య అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ దొడ్ల గౌరి, వైసీపీ యువజన విభాగం జనరల్ సెక్రటరీ దొడ్ల కరుణాకర్ రెడ్డి, నాయకులు కె. రేవంత్‌రెడ్డి, టి.నరసింహమూర్తి తదితరులు కుప్పం పర్యటనలో ఉన్న చంద్రబాబును కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి చంద్రబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసే అరాచకాలు చూసి తట్టుకోలేక వైసీపీని వీడామన్నారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్యవిభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ బిరుదాల భాస్కర్‌రెడ్డి, ఒ.కేశవులుశెట్టి, కె.శ్రీనివాసులు, బి.సిద్దారెడ్డి, జి.చెంగల్రామానాయుడు, కె.భాస్కర్‌రెడ్డి, కె.ముఖేష్‌రెడ్డి, కె.రవి, సుబ్రమణ్యం, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రానికి వైసీపీ రంగులు



ప్రియదర్శిని కాలనీలో చెత్తసంపద కేంద్రానికి వైసీపీ రంగులు
- వీధుల్లో ఎమ్మెల్యే పేరుతో ఉన్న సిమెంట్ బెంచీలు

తిరుపతి రూరల్,మార్చి27: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి పదకొండురోజులు గడిచినా తిరుపతి రూరల్ మండలంలోని మల్లంగుంట పంచాయతీ పరిధిలో ప్రియదర్శిని కాలనీలో ఉన్న చెత్త సంపదకేంద్రంతో పాటు అక్కడే ఏర్పాటు చేసిన తొట్టెలకు వైసీపీ రంగులు అలాగే దర్శనమిస్తున్నాయి. అలాగే ఇదేకాలనీలో పలుచోట్ల తుడా నిధులతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరుపై ఉన్న సిమెంటు బెంచీలపై ఎమ్మెల్యే పేరు అలాగే ఉంది. వైసీపీ రంగులతోపాటు బల్లలపై చెవిరెడ్డి పేరు అలాగే ఉంచడంపై అటువైపు వెళ్లే జనాలు, కాలనీ ప్రజలు చూసి వీటికి కోడ్ వర్తించదా అని చర్చించుకుంటున్నారు. కోడ్‌ను పక్కాగా అమలు చేసేందుకు టీమ్‌లను ఏర్పాటు చేసినా వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అభయ వినాయక ఆలయ కుంభాభిషేకం



పట్టువస్త్రాలు తెస్తున్న టీడీపీ నాయకుడు వినీల్

రామచంద్రాపురం, మార్చి 27: మండలంలోని పున్నమనాయుడుకండ్రిగలో నిర్మించిన అభయ వినాయక ఆలయ కుంభాభిషేకం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజల అనంతరం వాస్తు, గణపతి హోమం నిర్వహించారు. వేకువజామున అభయ వినాయకస్వామి ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా పురోహితులు చేశారు. స్వామివారికి టీడీపీ నాయకుడు పులివర్తి వినీల్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జనార్దన చౌదరి, మురళీమోహన్‌నాయుడు, గిరినాయుడు, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు

చంద్రగిరి, మార్చి 27: చంద్రగిరిలో వెలసిన మూలస్థాన ఎల్లమ్మ ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో గత డిసెంబరు 20 నుంచి ఈనెల 27వ తేది వరకు భక్తులు వేసిన కానుకలను లెక్కించారు. రూ.5,68,903 నగదు వచ్చింది. అలాగే తిరుపతి రూరల్ మండలం కొత్తచెర్లోపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ కానుకలు లెక్కించగా రూ.1,21,632 నగదు వచ్చింది. ఈవో పుట్టా రామకృష్ణారెడ్డి, చంద్రగిరి సప్తగిరి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, చంద్రగిరి పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

కిక్కు ఎక్కింది!



గత ఐదేళ్లతో పోలిస్తే పెరిగిన రూ.324 కోట్ల మద్యం విక్రయాలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 27 : గడచిన ఐదేళ్ల కంటే మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. ప్రభుత్వానికి ఆదాయం అదేస్థాయిలో చేరింది. ఎక్సైజ్ అధికారుల గణాంకాల మేరకు.. 2014 నుంచి 2019 వరకు తిరుపతి ఐఎంఎల్ డిపో, చిత్తూరు ఐఎంఎల్ డిపోల పరిధిలో దాదాపు రూ.6,242 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నాసిరకం బ్రాండ్లు విక్రయించడమేగాక ధరలు పెంచేశారు. ఈ లెక్కన 2019 నుంచి 2024 మార్చి 25వ తేదీ వరకు తిరుపతి జిల్లావ్యాప్తంగా రూ.6,566 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. అంటే రూ.324 కోట్లు పెరిగింది. ఎన్నికల సమయంలో జగన్ చెప్పిన మద్యపాన నిషేధం మాట గాలికివదిలి మందుబాబుల జేబులు గుల్ల చేశారు. కాగా, ఈ ఐదేళ్లలో నాసిరకం మందు తాగి 105 మంది మరణించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మద్యం దుకాణాలకంటే బార్లలోనే అత్యధిక సేల్స్

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు మద్యం దుకాణాలను మూసివేసి ప్రభుత్వ మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. తిరుపతి మద్యం డిపో పరిధిలో 148, గూడూరు డిపో పరిధిలో 105 షాపులు ఉన్నాయి. వీటితోపాటు 40 బార్లు, ఫైస్టార్ హోటళ్లు ఉన్నాయి. ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు ప్రభుత్వ మద్యం దుకాణాల కంటే బార్లలోనే అత్యధికంగా మందుబాబులు మద్యం తాగారు. జనవరి నుంచి మార్చి 25 వరకు బీర్లకంటే ఐఎంఎల్ లిక్కర్ అమ్మకాలు ఎక్కువగా జరిగాయి.

టీడీపీని గెలిపించే బాధ్యత మహిళలే తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధారెడ్డి

మంగళం, మార్చి 27: రాష్ట్రంలో మహిళల సంక్షేమం కోరే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలంటే రానున్న ఎన్నికల్లో మహిళలే చైతన్యవంతులై టీడీపీకి ఓటు వేసి,వేయించి చంద్రబాబును సీఎం చేయాలని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మంగళం పంచాయతీలో మహిళలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో సీఎం జగన్ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మహిళలకు, యువత, విద్యార్థులు, రైతులు, కార్మికులకు తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. ఉప్పరపాళెం దగ్గర నిరుపేదలు కట్టుకున్న ఇళ్లను కూల్చివేసి, మరం భూములను సైతం ఆక్రమించి తన ఖాతాలో వేసుకున్న చెవిరెడ్డికి బదులుగా ఆయన తనయుడుకి మళ్లీ అధికారం అప్పగించాలా అని ప్రశ్నించారు. మంగళం పరిధిలో అభివృద్ధి. ఆగిపోయిందని తాము అధికారంలోకి వస్తే నీరు, డ్రైనేజీలు, రోడ్లు, ఇళ్ల పట్టాల సమస్యలుతీరుస్తామన్నారు. అభివృద్ధి కోసం పాటుపడే పులివర్తి నాని కావాలో.. దౌర్జన్యాలు, స్మగ్లింగ్ చేసేవారు కావాలో మహిళలు తేల్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మంగళం పంచాయతీ అధ్యక్షుడు సురేష్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, నాయకులు బాలాజీప్రసాద్, సురేష్‌కుమాఆర్, రామకృష్ణ, నాగ రామమూర్తి యాదవ్, శశికుమార్, ధర్మారెడ్డి, మధు, రవికుమార్, చలపతి, నగేష్, లక్ష్మీనారాయణరెడ్డి, జగపతి, మహేశ్వరి, భారతి, రాణెమ్మ, మహేశ్వరి, ధనమ్మ,ప్రభావతి, కళావతి, ఈశ్వరయ్యగోపీనాథ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు స్కూటర్ దొంగల అరెస్టు

● 10 మోటారుసైకిళ్లు స్వాధీనం



స్కూటర్ దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

తిరుచానూరు, మార్చి 27: తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మోటారు సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టుచేసి వారి నుంచి 10 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తిరుచానూరు పోలీసులు తెలిపారు. ఎస్ఐ జగన్నాథ్‌రెడ్డి కథనం మేరకు.. తిరుపతి రూరల్‌మండలం పెరుమాల్లపల్లె పంచాయతీ లక్ష్మీపురానికి చెందిన షేక్ సంపత్ అలియాస్ బాషా,హరీష్ గత కొన్ని సంవత్సరాలుగా తిరుపతి నగరంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలను దొంగలించేవారని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం తిరుచానూరు చైతన్యపురం సమీపంలో మోటార్ సైకిల్‌పై వెళ్తూ పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించారు. ఎస్ఐ జగన్నాథ్‌రెడ్డి ఆ యువకులు సంపత్, హరీష్‌లను పట్టుకుని విచారించగా స్కూటర్లను చోరీకి పాల్పడినట్లువిచారణలో తేలింది. ఇందులో షేక్ సంపత్ అలియాస్ బాషా 20 కేసుల్లో నిందితుడని పోలీసులు తెలిపారు. గడచిన మూడేళ్లుగా వారిద్దరు కలిసి పది మోటారు సైకిళ్లను చోరీ చేసినట్లు తమ దర్యాప్తులో తేలిందని ఎస్ఐ తెలిపారు. నిందితుల నుంచి 9 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐ జగన్నాథ రెడ్డి తెలిపారు.

సత్తా చాటిన సెవెన్ హిల్స్ ఫార్మశీ విద్యార్థులు



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

రామచంద్రాపురం, మార్చి 27: రామచంద్రాపురం మండలం వెంకట్రామపురం సమీపంలోని సెవన్‌హిల్స్ ఫార్మశీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు.గుంటూరు విజ్ఞాన యూనివర్శిటీలో జరిగిన మొదటి రాష్ట్రస్థాయి కాన్ఫరెన్సులో వివిధ విభాగాల్లో తమ విద్యార్థులు అవార్డులు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నిరంజన్‌బాబు తెలిపారు. ఏబీవీపీ, విద్యార్థి వికాస సమితి సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు విజ్ఞాన్ యూనివర్శిటీలో ఫార్మ విజన్-2024పై రెండు రోజుల కాన్ఫరెన్సు నిర్వహించారన్నారు ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి నగదు బహుమతులనుఅందుకున్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ ఎం.సుమలత, అధ్యాపక బృందం అభినందించారు.

నడిరోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం



మంగళంలోని ఆర్టీవో కార్యాలయం నుంచి బీటీఆర్‌కాలనీకి వెళ్లే రోడ్డులో ఏర్పడ్డ గుంత

మంగళం, మార్చి 27: మంగళంలోని ఆర్టీవో కార్యాలయం పక్కనే ఉన్న బీటీఆర్ కాలనీకి వెళ్లే దారిలో పెద్ద గుంత ఉంది. ఇక్కడ ప్రమాదం పొంచి ఉందని బోర్డు సైతం ఏర్పాటు చేశారు. అయితే సమస్యను పరిష్కరిద్దామన్న ఆలోచన అటుగా వెళ్లే ప్రజాప్రతినిధులకు గాని, అధికారులకు గాని రాలేదు. పంచాయతీ అధికారులు కూడా పట్టించుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

డ్రైనేజీకి మరమ్మతులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(కొర్లగుంట), మార్చి 27: భవానీనగర్‌లోని శ్రీవేంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్‌కు వెళ్లే దారిలో డ్రైనేజీ పొంగి దుర్వాసన వస్తోంది. ఈ సమస్యను బుధవారం ఆంధ్రజ్యోతిలో 'ఇదేం నగరాభివృద్ధి' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన పారిశుధ్య విభాగం ఉదయమే కాలువకు మరమ్మతులు చేపట్టారు. శుభ్రంచేసి దుర్వాసన రాకుండా బ్లీచింగ్ వేశారు.



డ్రైనేజీ మరమ్మతులు చేపట్టి బ్లీచింగ్ చల్లిన దృశ్యం

ఆధునిక సాంకేతికతను వాడుకోవాలి



తిరుపతి (కల్చరల్), మార్చి 27: విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వంగిమల్ల శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని మెకానికల్ ఇంజనిరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎంఎక్స్‌ప్లోర్ 2024 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన పోకడలను ఆకళింపు చేసుకోవాలన్నారు. పరిశోధన పట్ల ఆసక్తి, అంకితభావం, కృషి ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్‌వీఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇటువంటి సమావేశాల ద్వారా విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య దామోదర రెడ్డి, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ దివాకర్ రెడ్డి, కన్వీనర్ ఆచార్య హేమ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీకి అన్నా రామచంద్ర రాజీనామా

● పెత్తందారీ విధానాలు నచ్చకనే వీడుతున్నా



తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 27: బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనార్టీల ప్రయోజనాలను, ఆర్థిక మూలాలను వైసీపీ ప్రభుత్వం దారుణంగా దెబ్బతీసింది.. పెత్తందారీ, రాచరిక విధానాలతో కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్నారు. పార్టీ విధానాలను వ్యతిరేకిస్తూ వైసీపీ క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నా.. అని ఆ పార్టీ నాయకుడు అన్నా రామచంద్రయాదవ్ ప్రకటించారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.30 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నా. ఏపీ బీసీ జేఏసీ చైర్మన్‌గా, అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడిగాను బాధ్యతలు నిర్వర్తిస్తున్న తాను వైసీపీలోకి వచ్చిన తరువాత గత ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి పనిచేశానన్నారు.అయితే ఈ ఎన్నికల్లో బీసీల జనాభా ప్రకారం వారికి కేటాయించాల్సిన సీట్లను వైసీపీ కేటాయించలేదన్నారు.రాష్ట్రంలో ప్రధానమైన సామాజికవర్గాల్లో యాదవ సామాజిక వర్గం ఒకటని, అయితే రాష్ట్రంలోని 13 జిల్లాల్లో యాదవ సామాజిక వర్గం నుంచి శాసనసభ నియోజకవర్గానికి ఒక్కరంటే ఒక్కరికి కూడా వైసీపీ సీటు కేటాయించలేదన్నారు. గడిచిన స్థానిక ఎన్నికల్లో తిరుపతి, విశాఖ మేయర్ పదవులను యాదవులకు కేటాయించినా వారి అధికారాలన్నీ ఎమ్మెల్యేలు, డిప్యూటీ మేయర్లు, వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ల చేతిలోనే ఉండిపోయాయన్నారు. మేయర్లు కేవలం ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారన్నారు.సాధారణంగా అధికారపక్షం వారు ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలు చేపడతారని, కానీ సొంత పార్టీ నేతల ప్రతిష్ఠను దిగజార్చేలా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.బీసీలకోసం, ఎస్సీ ఎస్టీల కోసం పనిచేస్తున్న తాము వారికి అన్యాయం జరుగుతున్నపుడు వైసీపీ నుంచి బయటకు రావాల్సిన అవసరం ఉంది కాబట్టే ఆ పార్టీకి రాజీనామా చేశానన్నారు. మూడు రోజులక్రితమే తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డికి, సీఎం కార్యాలయానికి రాజీనామా పంపించానన్నారు. అక్కడినుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో తన రాజీనామాను ప్రజలకు తెలియజేస్తున్నట్టు చెప్పారు. వైసీపీలో పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు పర్యవేక్షించే విధానం లేనందునే ఎమ్మెల్యేలు పెత్తందారుల్లా వ్యవహరిస్తున్నారని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తున్నారని, దాడులు చేయడమే కాక వారి భూములను కూడా ఆక్రమిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్మరణానంద మరణం బాధాకరం

తిరుపతి (కల్చరల్), మార్చి 27: కోల్‌కతాలోని శ్రీరామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి స్మరణానంద పరమపదించడం బాధాకరమని తిరుపతి శ్రీరామకృష్ణ మఠం సంచాలకులు సుకృతానంద అన్నారు. స్మరణానంద మరణం పట్ల రాష్ట్రపతి ముర్ము విచారం వ్యక్తం చేశారని తెలిపారు. తమిళనాడులోని తంజావూరు జిల్లాలో 1929 జన్మించిన ఆయన 22 ఏళ్ల వయసులో 1952లో ముంబై ఆశ్రమంలో సన్యాసం స్వీకరించారన్నారు. 2017 జూలై నుంచి శ్రీరామకృష్ణ ఆశ్రమం, మఠ్ అధ్యక్షులుగా సేవలందిస్తున్నారన్నారు.

మహిళా వర్సిటీకి రూ.47.9 లక్షల మంజూరు



తిరుపతి (కల్చరల్), మార్చి 27: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని జీవసాంకేతిక విజ్ఞాన విభాగంలోని బయోటెక్నాలజీ ఇంకుబేషన్ సెంటరుకు మూడవ ఏడాది కూడా రూ.47.9 లక్షల నిధులు విడుదలైనట్లు ఉపకులపతి ఆచార్య భారతి తెలిపారు. కొత్త ఢిల్లీలోని బయోటెక్నాలజీ పారిశ్రామిక పరిశోధన సహాయ మండలి ఆధ్వర్యంలో నిధులు విడుదలైనట్లు బుధవారం వర్సిటీలో జరిగిన ఒక కార్యక్రమంలో వీసీ ప్రకటించారు. దానికి సంబంధించిన పత్రాన్ని రిజిస్ట్రార్ ఆచార్య రజని, సెంటర్ సీఈవో ఆచార్య కళారాణి, ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ ఆచార్య విద్యావతికి వీసీ అందజేశారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



తిరుపతి (కల్చరల్), మార్చి 27: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అందుకు యోగ, ధ్యానం వంటివి ఉపకరిస్తాయని ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య జి.పద్మనాభం తెలిపారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం విస్తరణ విద్యా కేంద్రం, మహిళా అధ్యయన కేంద్రం, పాపులేషన్ స్టడీస్ అండ్ సోషల్ వర్క్ విభాగం సంయుక్తంగా బుధవారం మాదకద్రవ్యాల వినియోగం-పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. అధ్యక్షత వహించిన పద్మనాభం మాట్లాడుతూ సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగం పెనుభూతం లాగా విస్తరిస్తోందని, వాటి నుంచి యువతను దూరంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాస్ సంస్థ డ్రగ్ అడిక్షన్ సెంటర్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.మంజుల, ఆచార్య టి.చంద్రశేఖరయ్య, డాక్టర్ డి.రమణ, డాక్టర్ వీ జగదీశ్వరి, డాక్టర్ కె.శ్రీలత, డాక్టర్ పి.సునీత, డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ సివప్ప, డాక్టర్ కోదండ పాల్గొన్నారు.

7న ఉగాది కవి సమ్మేళనం

తిరుపతి (కల్చరల్), మార్చి 27 : శ్రీక్రోధినామ తెలుగు ఉగాదిని పురస్కరించుకుని తిరుపతి జిల్లా రచయితల సంఘం (తి.ర.సం) ఏప్రిల్ 7వ తేదీన కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఎయిర్ బైపాస్ రోడ్డులోని యూత్ హాస్టల్లో సభ జరుగుతుందని పేర్కొన్నారు. పాల్గొనదలచిన వారు 9704659343కు ఫోన్ చేసి, ఏప్రిల్ 5వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవం



తిరుపతి (కల్చరల్), మార్చి 27: తిరుపతికి చెందిన రాయలసీమ రంగస్థలి సంస్థ బుధవారం ప్రపంచ రంగస్థల దినోత్సవం ఘనంగా నిర్వహించింది. నాటక రంగంలో విశేష కృషి చేసిన వెంకటయ్య, కోటేశ్వరరావును సంస్థ అధ్యక్షుడు గుండాల గోపినాథ్ రెడ్డి ఘనంగా సత్కరించారు. కళాకారుల జీవితాలు మెరుగుపడడానికి అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగస్థల కళాకారులు కేఎస్ రాజా, కేశవులు, కొత్తపల్లి శంకరయ్య పాల్గొన్నారు.

చోరీ కేసులో జైలుశిక్ష

తిరుపతి(లీగల్), మార్చి 27 : చోరీ కేసులో రేణిగుంటకు చెందిన కె.గోవిందస్వామి, ఎం.గంగయ్య, కె.కుమార్‌కు ఏడాది జైలుశిక్ష విధిస్తూ తిరుపతి మొదటి అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి సత్యకాంత్‌కుమార్ బుధవారం తీర్పుచెప్పారు. 2023 మే 18వ తేదీ వీరు రేణిగుంట విమానాశ్రయం రూముల్లో కాపర్ వైర్లు చోరీ చేశారు. గాజులమండ్యం పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. కేసు నిరూపణ కావడంతో శిక్ష విధించారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

తిరుపతి(లీగల్), మార్చి 27: తిరుపతి బార్ అసోసియేషన్ (2024-25) ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఉదయం 9నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది ఊటుపల్లె లక్ష్మన్న తెలిపారు. 964మంది న్యాయవాదులు ఓటర్లుగా సభ్యత్వం నమోదు చేసుకున్నారని తెలిపారు. గుర్తింపుకార్డుతో ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. మూడు పోస్టులకుగాను ఆరుగురు అభ్యర్థులు పోటీపడుతున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న గవర్నర్ రాధాకృష్ణన్



అమ్మవారి ఆలయం వద్ద తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్

తిరుచానూరు, మార్చి 27: జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్ రాధాకృష్ణన్ బుధవారం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు ఆయనకు సాంప్రదాయంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానంతరం గవర్నర్ రాధాకృష్ణన్‌ను ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

సి-విజిల్ యాప్ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి



సమావేశానికి హాజరైన జేసీ ధ్యానచంద్ర

తిరుపతి (కలెక్టరేట్), మార్చి 27: సి-విజిల్ యాప్‌కు వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో బుధవారం ఆయన సమీక్షించారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర నోడల్ అధికారులతో కలిసి హాజరయ్యారు. ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ అక్రమ మద్యం, నగదు, డ్రగ్స్ తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం జేసీ ధ్యానచంద్ర అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల ఫిర్యాదుల పరిష్కారం, నివేదికల తయారీపై నిర్లక్ష్యం తగదన్నారు. డీఆర్వో పెంచలకిషోర్ పాల్గొన్నారు.

జోరుగా ఫుట్‌వోవర్ బ్రిడ్జి పనులు



ఎస్ఎస్ టెంపుల్ వద్ద జరుగుతున్న పనులు

తిరుమల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అలిపిరి మార్గంలో కాలినడకన తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎస్ఎస్ టెంపుల్ (లక్ష్మీనరసింహ స్వామి ఆలయం) వద్ద రూ.70 లక్షలతో నిర్మిస్తున్న ఫుట్‌వోవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. 3,600 మెట్లు కలిగిన ఈ మార్గంలో ఎస్ఎస టెంపుల్ నుంచి మోకాళ్లమిట్ట వరకు 1.6 కిలోమీటర్లు రోడ్డు వెంబడే నడవాల్సి వస్తుంది. ఎస్ఎస్ టెంపుల్ వద్ద మెట్లు దిగగానే రోడ్డు దాటాల్సి ఉండడం, వాహనాలు వేగంగా వస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో బ్రిడ్జి నిర్మాణం తలపెట్టారు. నెలగా ఈ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే 70 శాతం పూర్తయ్యాయి.

నిర్భయంగా ఓటు వేయండి



యూనివర్సిటీ పరిధిలో కవాతు నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ దళాలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 27 : 'ఓటర్లూ మీకు మేమున్నాం... ఎన్నికల రోజు నిర్భయంగా ఓటు వేయండి' అంటూ యూనివర్సిటీ సీఐ మురళీధర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం యూనివర్సిటీ పరిధిలోని పద్మావతి నగర్, ఎల్బీనగర్, ఎస్వీ నగర్, మారుతీనగర్, వెంగమాంబ సర్కిల్, రాళ్లపల్లి సర్కిల్, మహిళా యూనివర్సిటీ, అన్నమయ్య సర్కిల్ ప్రాంతాల్లో కేంద్ర పారా మిలిటరీ బలగాలతో కవాతు నిర్వహించారు. ఓటర్లకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ఓటును అమ్ముకోవద్దని, ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. యూనివర్సిటీ ఏఎస్ఐ కోదండరాం, హెడ్ కానిస్టేబుల్స్, బీఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

రుయాలో అడుగడుగునా నిర్లక్ష్యం



రుయాస్పత్రి పరిపాలన భవనం ముందు వదిలేసిన ఆక్సిజన్ సిలిండర్లు - ఆర్థోవార్డుకు రోగిని స్ట్రెచ్చర్‌పై తీసుకెళుతున్న సహాయకులు

తిరుపతి(వైద్యం), మార్చి 27 : రుయాస్పత్రిలో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తుంది. రోగులతోపాటు విలువైన వైద్య పరికరాలను సైతం పట్టించుకునేవారు కరువయ్యారు. పరిపాలన భవనం ముందు రెండు ఆక్సిజన్ సిలిండర్లను వీల్‌చైర్‌పై పెట్టి రోడ్డుపైనే నిర్లక్ష్యంగా వదిలేశారు. అలాగే కదలలేని స్థితిలో ఉండే రోగులను వార్డుల వద్దకు తీసుకువెళ్లేందుకు సిబ్బంది అందుబాటులో ఉండకపోతుండటంతో ఆ పని సహాయకులే చేయాల్సి వస్తోంది. అధికారుల పర్యవేక్షణ లోపం రోగుల పాలిట శాపంలా మారింది.

శ్రీనివాసయాదవ్‌కు పలువురి శుభాకాంక్షలు



శ్రీనివాసయాదవ్‌ను సన్మానిస్తున్న నేతలు

మంగళం, మార్చి 27: టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసయాదవ్ 74వ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వగృహంలో జవ్వాజ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ గంగాధర యాదవ్, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ జయరాం యాదవ్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు, బీసీసెల్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన చేత కేక్ కట్ చేయించి, శుభాకాంక్షలు తెలిపారు. బీసీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆయనకు దేవదేవుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



బాబు లాల్ మారండి - సాంబశివరావు - ఏక్తాకపూర్, అనిత

తిరుమల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీ రమేష్, జార్ఖండ్ మాజీ సీఎం బాబులాల్ మారండి, ప్రముఖ సీరియల్ నిర్మాత ఏక్తాకపూర్, నటి అనిత, టీటీడీ మాజీ ఈవో సాంబశివరావు ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.91 కోట్లు

తిరుమల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.91 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 68,563 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,956 మంది తలనీలాలు సమర్పించారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు ప్రారంభం



స్కేటింగ్ చేస్తున్న క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), మార్చి 27: శ్రీనివాస క్రీడా సముదాయంలో బుధవారం సాయంత్రం 67వ ఎస్జీఎఫ్ అంతర్ జిల్లాల అండర్ 11, 14 స్కేటింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించ నున్న ఈ పోటీలకు 26 జిల్లాల నుంచి బాలబాలికలు 200మంది హాజరయ్యారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విద్యాశాఖాధికారి శేఖర్, క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్, రాష్ట్ర స్కూల్‌గేమ్స్ సెక్రటరీ భానుమూర్తి, అండర్ 19 స్కూల్‌గేమ్స్ సెక్రటరీ జయరామయ్య, అండర్ 14, 17స్కూల్‌గేమ్స్ సెక్రటరీ పి.విజయకుమారి, కోచ్‌లు ప్రేమ్‌నాథ్, గంగాధర్, పురుషోత్తం, బాబ్జి, ప్రసాద్, శశి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

ముగిసిన పదో తరగతి జనరల్ పరీక్షలు

● చివరి పరీక్షకు 709 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి 27: పదో తరగతి జనరల్ విభాగ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు జరిగిన సాంఘిక పరీక్షకు 709 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 27,030 మంది హాజరుకావాల్సి ఉండగా 26,321 మంది హాజరయ్యారు. 97.37 శాతం మంది పరీక్షలు రాశారు. ఎక్కడా మాస్ కాపీగాని, డీబార్‌లుగాని చోటుచేసుకోలేదని డీఈఓ వెల్లడించారు.

28, 30 తేదీల్లో కాంపోజిట్ కోర్సుల పరీక్షలు

కాంపోజిట్ కోర్సులకు గురువారం పరీక్ష జరుగనుంది. ఉదయం 9.30 నుంచి 11.15 వరకు ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్ష, ఉదయం 9.30 నుంచి 12.45 వరకు మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 పరీక్ష జరుగనుంది. శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు మెయిన్ లాంగ్వేజ్-2 పరీక్ష, 9.30 నుంచి 11.30 వరకు ఒకేషనల్ పరీక్ష జరుగనుంది.

ఓటర్లను ప్రలోభపెట్టడానికి వైసీపీ కుయుక్తులు

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బొజ్జల, నరసింహాయాదవ్



తిరుపతి(కలెక్టరేట్), మార్చి 27: ఓటర్లను ప్రభావితం చేయడానికి కోట్లాది రూపాయల విలువ చేసే తాయిలాలను డంప్ చేసిన వైసీపీ అభ్యర్థులు, నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ కలెక్టర్ లక్ష్మీశాను కోరారు. రేణిగుంట వద్ద ప్రైవేటు గోదాములో వైసీపీ నాయకులు వస్తువులను డంప్ చేశారని వారు బుధవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. టీడీపీ నేతలు ఈ అక్రమ డంప్‌ను పట్టించినా అధికారుల నుంచి స్పందన కరువైందన్నారు. గోదాముల్లో తనిఖీలు చేసి, తాయిలాలకు సంబంధించిన సీజ్ చేయాలని కోరారు. శ్రీకాళహస్తి రిట్నరింగ్ అధికారి పనితీరు సరిగా లేదని, అతని స్థానంలో మరొకరిని నియమించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్ వద్ద బొజ్జల, నరసింహయాదవ్ మీడియాతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అధికార పార్టీ కుయుక్తులు పన్నుతోందన్నారు. స్థానిక పోలీసులు సహకరిస్తున్నారని ఆరోపించారు. ప్రలోభాలకు సంబంధించిన వస్తువులను పట్టించినా చర్యలు తీసుకోకపోవడం దేనికి సంకేతమో చెప్పాలన్నారు. దీనిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్‌కు కూడా దీనిపై అవగాహన లేదని, వెంటనే ఆయన్ను బదిలీ చేసి, సీనియర్‌ను ఆ స్థానంలో నియమించాలని కోరారు.

ఎన్నికల నిబంధనలు పాటించకుంటే కేసులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి27 : ఎన్నికల నిబంధనలు పాటించకుంటే దండన తప్పదని ఎన్నికల సంఘం హెచ్చరిస్తోంది. ఎన్నికల సంఘం జారీచేసిన నిబంధనలను ఒకసారి పరిశీలిద్దాం.. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు కులం, మతం, ప్రాంతం, వర్గ, జాతి భేదాలు వంటి సున్నితమైన అంశాలను వాడకూడదు. ఆలయాలు, మసీదులు, ప్రార్థనా మందిరాల్లో ప్రచారం చేయరాదు. అనుమతి ఉన్న వాహనాల్లో మాత్రమే ప్రచారం చేయాలి. ఈ వాహనాల్లో ఐదుగురి కంటే ఎక్కువగా ప్రయాణం చేయరాదు, నామినేషన్ వేసే సమయంలో మూడు వాహనాల్లో మాత్రమే వెళ్లాలి. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల లోపు వాహనాలు ఆపాలి. ప్రచారంలో మద్యం పూర్తిగా నిషేధం. సభలు, సమావేశాలు, ప్రదర్శనలకు రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలి. సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ పూర్తిగా నిషేధం. పోలింగ్ స్టేషన్‌లోకి అక్రమంగా ప్రవేశించడం, ఈవీఎం, ఇతర రికార్డులను తొలగించడం చేయరాదు. నిషేధిత ప్రాంతా ల్లో సభలు, సమావేశాలు పెట్టకూడదు.

ఈ పనులు చేయవచ్చు.. : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా మంచినీటి సరఫరా చేయవచ్చు. పబ్లిక్ మైదానాలను సభలు, సమావేశాలకు అనుమతితో వినియోగించుకోవచ్చు. ప్రత్యర్థి పార్టీల విధి విధానాలపై విమర్శలు చేయవచ్చు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందస్తు అనుమతితో ఊరేగింపులు, ర్యాలీలు చేయవచ్చు.

నగదు తీసుకెళుతున్నారా జాగ్రత్త..

ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్న నేపథ్యంలో పరిమితికి మించి డబ్బు తీసుకెళితే అధికారులు సీజ్ చేయవచ్చు. రూ.50 వేలకు మించి తీసుకెళితే ఆధారాలు చూపించాలి. అత్యవసర వైద్యసేవల కోసం నగదు తీసుకెళ్లాల్సి వస్తే వైద్యానికి సంబంధించిన రికార్డులు చూపించాలి. బ్యాంకు నుంచి డబ్బు డ్రాచేసి ఉంటే పాస్‌బుక్ స్టేట్‌మెంట్ చూపించాలి. రూ.10 లక్షల కంటే ఎక్కువ డబ్బు దొరికితే దాన్ని ఆదాయపు పన్ను శాఖకు అప్పగిస్తారు.

గంజాయి విక్రయాలను ప్రోత్సహిస్తున్నది ఎమ్మెల్యే, ఆయన కుమారుడే

టీడీఆర్ బాండ్ల రూపంలో సంపాదించిన ధనాన్ని కక్కిస్తా ● ప్రచార కార్యక్రమంలో ఆరణి శ్రీనివాసులు



తిరుపతి (జీవకోన), మార్చి 27: నగరంలో గంజాయి విక్రయాలను ప్రోత్సహిస్తున్నది ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డి అని టీడీపీ కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన కపిలతీర్థం సర్కిల్ నుంచి లీలామహల్ మీదుగా జీవకోన వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. జీవకోనలోని జీవలింగేశ్వరస్వామి, గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించి, ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఎమ్మెల్యేగా అవకాశమిస్తే తిరుపతి నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని అన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గడచిన ఐదేళ్లల్లో ఎమ్మెల్యే, ఆయన కుమారుడు నగరానికి చేసిందేమీ లేదన్నారు. డిప్యూటీ మేయర్‌గా ఉన్న అభినయ్‌రెడ్డి మేయర్ అధికారాలను కూడా చేతిలోకి తీసుకుని ఇష్టానుసారం వ్యవహరించారని ఆరోపించారు. టీడీఆర్ బాండ్లు ఇస్తామని ఆశ చూపి, అనేకచోట్ల రాత్రికి రాత్రి ఇళ్లను కూలదోసి, రోడ్లు నిర్మించారని అన్నారు. అయితే ఇప్పటివరకు టీడీఆర్ బాండ్లు ఇవ్వలేదన్నారు. ఆ రూపంలో వారు సంపాదించిన ధనాన్ని కక్కిస్తానన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిని తమ ప్రభుత్వం రాగానే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. గాజు గ్లాస్ గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సాయంత్రం కూడా జీవకోన ప్రాంతంలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, రాజారెడ్డి, టీడీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే మోహన్, డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, సింగంశెట్టి సుబ్బరామయ్య, తిరుమల కేశవులు, సూరా సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, మార్చి 27: తిరుపతి జిల్లా నాయుడుపేట సమీపంలోని అత్తివరం అటవీ ప్రాంతంలో బుధవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు 51ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. కడప సబ్ డివిజన్ ఆర్ఎస్ఐ నరేష్ బృందం మంగళవారం రాత్రి వెంకటగిరి మార్కెట్ చెక్‌పోస్టు నుంచి ఎగ్జిట్ పాయింట్లు తనిఖీలు చేసింది. తెల్లవారుజామున బాలాయపల్లి మండలం నాయుడుపేట రేంజ్‌లోని అత్తివరం వద్ద అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టింది. ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకునేందుకు ప్రయత్నించగా ఇద్దరు పారిపోయారు. ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించగా ఎర్రచందనం దుంగలు దాచిన డంప్‌ను చూపించాడు. 46ఎర్రచందనం దుంగలతో పాటు ఐదు ఎర్రచందనం వృక్షాలవేర్లను స్వాధీనంచేసుకున్నారు.పట్టుబడ్డ వ్యక్తి అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరుకు చెందిన సయ్యద్ ముక్తియార్ అలియాస్ బాషా(27) గుర్తించారు.పరారీలోఉన్న నాయుడుపేటకు చెందిన ఆంబోతుల రంగయ్య, ఆంబోతుల శివ కోసం టాస్క్‌ఫోర్సు పోలీసులు గాలిస్తున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బర్డ్‌లో కృత్రిమ అవయవాల అమరిక కేంద్రం

● కృత్రిమ అవయవాల తయారీకి రూ.కోటి విరాళం



కృత్రిమ అవయవాల అమరిక కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దాత బాలసుబ్రహ్మణ్యం

తిరుపతి(వైద్యం), మార్చి 27 : బర్డ్ ఆస్పత్రిలో రోగుల అవసరార్థం దాతల సహకారంతో కృత్రిమ అవయవాల అమరిక కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావడం గర్వకారణమని బర్డ్ ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్పరెడ్డి పేర్కొన్నారు. బర్డ్‌లో కృత్రిమ అవయవాల తయారీ, అమరిక కోసం నేలానికి చెందిన దాత బాలసుబ్రహ్మణ్యం రూ.కోటి విరాళాన్ని అందించారు. దీంతో ఏర్పాటు చేసిన కృత్రిమ అవయవాల అమరిక కేంద్రాన్ని దాత చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నడవలేని పరిస్థితులో ఉన్న వారికి చేయూతగా తనవంతు ఈ సహకారాన్ని అందిం చినట్లు తెలిపారు. రెడ్డెప్పరెడ్డి మాట్లాడుతూ బర్డ్‌లో కాళ్లు లేని వారిని సైతం నడిపించాలనే లక్ష్యంతో అత్యాధునిక కృత్రిమ అవయవాల తయారీ, అమరిక కేంద్రం అందుబాటులోకి రావడం హర్షణీయమన్నారు.

సమాజంలో స్త్రీ పాత్ర ముఖ్యమైంది



తిరుపతి (కల్చరల్), మార్చి 27: ఆది నుంచి స్త్రీ అనేక కష్టాలను అధిగమిస్తూ జీవన పోరాటం సాగిస్తోందని ప్రముఖ కథ, నవలా రచయిత జిల్లేళ్ల బాలాజీ అన్నారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం రెవరెండ్, డాక్టర్ కటాక్షమ్మ పాల్ రాజ్ ధర్మనిధి ఉపన్యాస సభ నిర్వహించారు. వర్సిటీ సెమినార్ హాల్, హ్యూమనిటీస్ బ్లాక్-1లో జరిగిన ఈ సభలో తెలుగు తమిళ రచనల్లో స్త్రీ వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై కీలకోపన్యాసం చేసిన జిల్లేళ్ల బాలాజీ మాట్లాడుతూ సీత నుంచి అహల్య, యశోధర వరకూ భర్తచాటు భార్యలుగా మహిళలు ఎన్నో కష్టాలను అనుభవించారన్నారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో వచ్చిన పలు కథలు స్త్రీని అర్థం చేసుకోవాలని, సమానమైన స్థానం, గౌరవం ఇవ్వాలని కాంక్షించినట్లు తెలిపారు. సభ సంచాకులు డాక్టర్ డి.యువశ్రీ మాట్లాడుతూ విద్యార్థులకు తెలుగు సాహిత్యం మీద అవగాహన కలగడానికి ఇటువంటి ధర్మనిధి ఉపన్యాసాలు ఉపకరిస్తాయన్నారు. సభకు తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ వై.సుభాషిణి అధ్యక్షత వహించారు. ఎన్.గౌరీ స్వాగతం పలుకగా, డాక్టర్ బి.లక్ష్మీప్రియ అతిథులను సభకు పరిచయం చేశారు. ప్రముఖ కథకులు వీఆర్ రాసాని, కృష్ణస్వామి రాజు, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సంస్కృత వర్సిటీలో టాలెంట్ ఫెస్ట్

తిరుపతి(రూరల్), మార్చి 27: స్థానిక జాతీయ సంస్కృత వర్సిటీలో గురువారం నుంచి ఈ నెల 31వరకు అఖిల భారత సంస్కృత విద్యార్థుల టాలెంట్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ డాక్టర్ ఎంజీనందనరావు పేర్కొన్నారు. దేశంలోని పలు సంస్కృత వర్సిటీల నుంచి విద్యార్థులు హాజరువుతున్నారని, వక్తృత్వ, క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలిరోజు గురువారం ఉదయం 10గంటలకు వర్సిటీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.


అలసి.. సొలసి



బలపం పట్టి బడికెళ్లాల్సిన ఈ చిన్నారి తిరుమలలో ఉదయం నుంచి రాత్రి వరకు బుడగలు చేతబట్టి రోడ్డుపై తిరిగి అమ్ముతూ బాగా అలిసిపోయాడు. తిరుమలలోని నందకం విశ్రాంతి భవనం వద్దనున్న జల ప్రసాదం కేంద్రం వద్ద బుధవారం రాత్రి గాఢ నిద్రలోకి జారుకున్నాడు. ఇలా 5 నుంచి 15 ఏళ్లలోపు వయస్సు కలిగిన చాలామంది చిన్నారులు తిరుమలలో భక్తులకు నామాలు పెడుతూ, బుడగలు విక్రయిస్తూ తిరుగుతున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఆరణికి కాపునాడు నేతల మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న కాపు సంఘం నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 27: టీడీపీ కూటమి తిరుపతి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు రాష్ట్ర కాపునాడు సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సరిత నాగరాజు రాయల్, ప్రధాన కార్యదర్శి గుట్టా నాగరాజ రాయల్ బుధవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ ఆరణి శ్రీనివాసులుకు ఓట్లువేసి గెలిపించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక జిల్లాలో భూకబ్జాలు, దాడులు పెరిగిపోయాయని, దాని నుంచి విముక్తి లభించాలంటే టీడీపీ కూటమిని గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో కంబాల జనార్దన్, పాలకళ జనార్దన్, పూల ప్రభాకర్, డాక్టర్ కరుణానిధి, తమ్మిశెట్టి మురళి పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై బైండోవర్ కేసులు



విడుదలైన టీడీపీ నాయకులు

తిరుపతి (నేరవిభాగం), మార్చి 27 : ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం తెలుగుదేశం పార్టీ నాయకులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. 2021 తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో 45వ డివిజన్‌లో టీడీపీ నాయకులు ప్రచారం చేస్తుండగా కార్పొరేటర్ అనిష్ రెడ్డి అనుచరులు వారిపై దాడి చేశారు. ఈ ఘటనలో అప్పట్లో టీడీపీ నాయకులు బత్తెల రవి, లోకనాథయాదవ్, లోకేష్ నాయుడు, సుజాత, డిష్ హరి, పురుషోత్తం, వరలక్ష్మి అలియాస్ నాయుడమ్మపై అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తర్వాత లోక్ అదాలత్‌లో ఇరువర్గాలు రాజీ పడ్డారు. తాజాగా బుధవారం అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి ఇదివరకు కేసుల్లో ఉన్న వారిని పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి, తహసీల్దార్ ఎదుట హాజరుపరచి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

'మేమంతా సిద్ధం' సభలకు.. 197ఆర్టీసీ బస్సుల తరలింపు



బస్సుల్లేక నిరీక్షిస్తున్న ప్రయాణీకులు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 27: జిల్లా పరిధిలోని 197 ఆర్టీసీ బస్సులు వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగే 'మేమంతా సిద్ధం' సభకు జనసమీకరణకు తరలివెళ్లాయి. 11 డిపోల నుంచి మంగళవారం అర్ధరాత్రి తర్వాత బస్సులు వెళ్లడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. ముఖ్యంగా తిరుపతి సెంట్రల్ బస్టాండు వద్ద బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండడం కనిపించింది. తిరుమలకు ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులో ఉండడంతో కొరత కనిపించలేదు. తరచూ ఇదేం చోద్యమని ప్రయాణికులు ఆర్టీసీ యాజమాన్యంపై మండిపడ్డారు. ఒకానొక దశలో విధుల్లో ఉన్న సిబ్బందితో గొడవకుదిగారు. కాగా ప్రొద్దుటూరుకు వెళ్లిన బస్సుల్లో 182 గురువారం నంద్యాలలో జరిగే మేమంతా సిద్ధం సభకు వెళ్లనున్నాయి. శనివారం తిరిగి జిల్లాకు రానున్నాయి.

పాఠశాలకు ఆర్వో ప్లాంటు వితరణ



తిరుపతి అర్బన్, మార్చి 27: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం ఓ దాత రూ.2లక్షలతో నీటి శుద్ధి యంత్రాన్ని(ఆర్వోప్లాంటు) వితరణ చేశారు. 4వ డివిజన్ పరిధిలోని డీబీఆర్ రోడ్డులో ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్ విద్యార్థులు తాగునీటి సౌకర్యం లేక అవస్థలు పడుతుండడం పక్కనే ఉన్న 'శ్రీకన్వెన్షన్' యాజమాన్యం గుర్తించి నూతన ఆర్వో ప్లాంటును సమకూర్చింది. బుధవారం ఉదయం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.మంగమ్మకు శ్రీకన్వెన్షన్ ప్రతినిధులు అందజేశారు.

పాఠశాల శిలాఫలకానికి ముసుగు



తిరుపతి (కొర్లగుంట), మార్చి 27 : స్థానిక డీబీఆర్ రోడ్డులోని సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్లో ప్రధాన గుమ్మం పక్కన శిలాఫలకంలో రాజకీయ నేతల పేర్లు ఉండడంతో ఎన్నికల కోడ్ వర్తించదా అంటూ కొన్ని రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. స్పందించిన పాఠశాల ఉపాధ్యాయులు పేర్లు కనబడకుండా ముసుగువేశారు.

తిరుపతి టౌన్‌బ్యాంక్ మహాజన సభ వాయిదా

తిరుపతి సెంట్రల్ మార్చి 27: తిరుపతి టౌన్ బ్యాంక్ మహాజన సభను వాయిదా వేస్తున్నట్లు ఆ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ శివకుమార్ రెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా వాయిదా వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని బ్యాంక్ వాటాదారులు గుర్తించాలని కోరారు.

వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక



కామకూరు నాయకులను ఆహ్వానిస్తున్న కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, మార్చి27: మండలంలోని కామకూరు మాజీ సర్పంచ్ కిరణ్మయి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పట్టెం రమణయ్యతో పాటు సుమారు 50 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలను అందజేస్తున్న రోటరీ వెస్ట్‌క్లబ్ సభ్యులు

గూడూరు, మార్చి 27: స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో బుధవారం రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో బుస్సారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి దాతృత్వంతో దివ్యాంగులకు నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు సనత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రతినెలా తమ క్లబ్ ఆధ్వర్యంలో నెలకు సరిపడా నిత్యావసరాలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ధనుంజయరెడ్డి, నాగులు, సుబ్రమణ్యం, రాఘవరెడ్డి, ఎస్ఎల్ఎన్‌బాబు, శ్రీనివాసులు, బలరామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రొట్టెలు, పండ్ల పంపిణీ


వృద్ధులకు పండ్లు, రొట్టెలు అందజేస్తున్న జనసేన నాయకులు

గూడూరు, మార్చి 27: స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో బుధవారం సినీ హీరో రామ్‌చరణ్ పుట్టిరోజు సందర్భంగా అఖిలభారత చిరంజీవి యువత, జనసేన పార్టీ ఆధ్వర్యంలో వృద్ధులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ మాట్లాడుతూ సినీ అభిమానులను సేవారంగం వైపు నడిపించిన ఘనత మెగా కుటుంబానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవర్ధన్, చంద్రనీల్, సాయి, మనోజ్, తిరుపాల్, పెంచలయ్య, సనత్, శ్రీనాథ్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

కిక్కు ఎక్కింది!



గత ఐదేళ్లతో పోలిస్తే
పెరిగిన రూ.324 కోట్ల విక్రయాలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 27 : గడచిన ఐదేళ్ల కంటే మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. ప్రభుత్వానికి ఆదాయం అదేస్థాయిలో చేరింది. ఎక్సైజ్ అధికారుల గణాంకాల మేరకు.. 2014 నుంచి 2019 వరకు తిరుపతి ఐఎంఎల్ డిపో, చిత్తూరు ఐఎంఎల్ డిపోల పరిధిలో దాదాపు రూ.6,242 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నాసిరకం బ్రాండ్లు విక్రయించడమేగాక ధరలు పెంచేశారు. ఈ లెక్కన 2019 నుంచి 2024 మార్చి 25వ తేదీ వరకు తిరుపతి జిల్లావ్యాప్తంగా రూ.6,566 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. అంటే రూ.324 కోట్లు పెరిగింది. ఎన్నికల సమయంలో జగన్ చెప్పిన మద్యపాన నిషేధం మాట గాలికివదలి మందుబాబుల జేబులు గుల్లచేశారు. కాగా, ఈ ఐదేళ్లలో నాసిరకం మందు తాగి 105 మంది మరణించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మద్యం దుకాణాలకంటే బార్లలోనే అత్యధిక సేల్స్

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు మద్యం దుకాణాలను మూసివేసి ప్రభుత్వ మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. తిరుపతి మద్యం డిపో పరిధిలో 148, గూడూరు డిపో పరిధిలో 105 షాపులు ఉన్నాయి. వీటితోపాటు 40 బార్లు, ఫైస్టార్ హోటళ్లు ఉన్నాయి. ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు ప్రభుత్వ మద్యం దుకాణాల కంటే బార్లలోనే అత్యధికంగా మందుబాబులు మద్యం తాగారు. జనవరి నుంచి మార్చి 25 వరకు బీర్లకంటే ఐఎంఎల్ లిక్కర్ అమ్మకాలు ఎక్కువగా జరిగాయి.

బర్డ్‌లో కృత్రిమ అవయవాల అమరిక కేంద్రం

● కృత్రిమ అవయవాల తయారీకి రూ.కోటి విరాళం


కృత్రిమ అవయవాల అమరిక కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దాత బాలసుబ్రహ్మణ్యం

తిరుపతి(వైద్యం), మార్చి 27 : బర్డ్ ఆస్పత్రిలో రోగుల అవసరార్థం దాతల సహకారంతో కృత్రిమ అవయ వాల అమరిక కేంద్రాన్ని అందు బాటులోకి తీసుకు రావడం గర్వకారణమని బర్డ్ ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్పరెడ్డి పేర్కొన్నారు. బర్డ్‌లో కృత్రిమ అవయవాల తయారీ, అమరిక కోసం సేలానికి చెందిన దాత బాలసుబ్రహ్మణ్యం రూ.కోటి విరాళాన్ని అందించారు. దీంతో ఏర్పాటు చేసిన కృత్రిమ అవయవాల అమరిక కేంద్రాన్ని దాత చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నడవలేని పరిస్థితులో ఉన్న వారికి చేయూతగా తనవంతు ఈ సహకారాన్ని అందించినట్లు తెలిపారు. రెడ్డెప్పరెడ్డి మాట్లాడుతూ బర్డ్‌లో కాళ్లు లేని వారిని సైతం నడిపించాలనే లక్ష్యంతో అత్యాధునిక కృత్రిమ అవయవాల తయారీ, అమరిక కేంద్రం అందుబాటులోకి రావడం హర్షణీయమన్నారు.

పదో తరగతి చివరి పరీక్షకు 709 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి 27: పదో తరగతి జనరల్ విభాగ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు జరిగిన సాంఘిక పరీక్షకు 709 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 27,030 మంది హాజరుకావాల్సి ఉండగా 26,321 మంది హాజరయ్యారు. 97.37 శాతం మంది పరీక్షలు రాశారు. ఎక్కడా మాస్ కాపీగాని, డీబార్‌లుగాని చోటుచేసుకోలేదని డీఈఓ వెల్లడించారు.

28, 30 తేదీల్లో కాంపోజిట్ కోర్సుల పరీక్షలు

కాంపోజిట్ కోర్సులకు గురువారం పరీక్ష జరుగనుంది. ఉదయం 9.30 నుంచి 11.15 వరకు ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్ష, ఉదయం 9.30 నుంచి 12.45 వరకు మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 పరీక్ష జరుగనుంది. శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు మెయిన్ లాంగ్వేజ్-2 పరీక్ష, 9.30 నుంచి 11.30 వరకు ఒకేషనల్ పరీక్ష జరుగనుంది.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఇచ్చిన హామీలను విస్మరించిన వైసీపీ

గూడూరు అర్బన్, మార్చి 27: గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మద్యనిషేధం చేస్తామని చెప్పిన జగన్ తర్వాత మాట తప్పారన్నారు. నాశిరకం మద్యం అమ్మకాలు సాగిస్తూ 30వేల మంది మరణాలకు కారణమయ్యారన్నారు. 9 సార్లు విద్యుత్‌చార్జీలను పెంచి ప్రజలపై రూ.64వేల కోట్ల భారం మోపారని మండిపడ్డారు. మెగా డీఎస్సీ లేకుండా చేసి 2.30లక్షల మంది నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. పెట్రోలు, డీజిల్ ధరలను పెంచివేశారన్నారు. రానున్న ఎన్నికలలో వైసీపీని ఇంటికి సాగనంపాలని కోరారు.

హత్యాయత్నంపై కేసునమోదు

చిల్లకూరు, మార్చి 27: మండలంలోని బూదనం గ్రామంలో సోమశేఖర్ అనే వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. బూదనం గ్రామంలో ఆదివారం రాత్రి సోమశేఖర్ అనే యువకుడికి గ్రామానికి చెందిన ఏడుకొండలు, వినోద్, మౌలాల మధ్య స్వల్ప వివాదం జరిగింది. మాటమాటా పెరిగి ఘర్షణ జరిగింది. ఏడు కొండలు, వినోద్, మౌలాల కలిసి సోమశేఖర్‌పై కత్తితో దాడి చేశారు. అతడు గాయాల పాలయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ అంజిరెడ్డి కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

తడ, మార్చి 27 : రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని అక్కంపేట రైల్వే స్టేషన్‌కు సమీపంలోని దిగువ రైలు మార్గంలో బుధవారం సాయంత్రం సుమారు 65 నుంచి 70 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వృద్ధు రాలు పట్టాలను దాటుతుండగా రైలు ఆమెను ఢీకొంది. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి వద్ద ఎటువంటి ఆధారాలు దొరకలేదు. మృత దేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని లారీ డ్రైవర్ మృతి


సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

గూడూరు, మార్చి 27: మండలంలోని తిరువెంగలాయపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ మృతిచెందాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. బాలాయపల్లి మండలం నిండలి గ్రామానికి చెందిన వెంకటాద్రి (28) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం సొంత పనుల నిమిత్తం మోటారుసైకిల్‌పై గూడూరుకు వచ్చి తిరిగి గ్రామానికి వెళుతు న్నాడు. తిరువెంగలాయపల్లి గ్రామ సమీపంలో వెంకటగిరి వైపు నుంచి గూడూరు వైపు వస్తున్న ఓ కారు అదుపుతప్పి అతడి మోటారు సైకిల్‌ను ఢీకొంది. దీంతో వెంకటాద్రి మృతిచెందాడు. ఎస్ఐ మనోజ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోబోల్తా.. ముగ్గురికి గాయాలు

సూళ్లూరుపేట, మార్చి 27: మండల పరిధిలోని పెరిమిటిపాడు వద్ద ఆటోబోల్తా పడ్డ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు .. బుచ్చినాయుడు కండ్రిగ నుంచి సూళ్లూరుపేటలో వివాహానికి వెళ్లేందుకు పదిమంది ఆటోలో బయలు దేరారు. పెరిమిటిపాడు సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రత్నమ్మ, రామక్రిష్ణ, లక్ష్మీనారాయణకు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు మరో ఆటోలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పుత్తూరు వార్తలు

వైసీపీకి షాక్

● టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కౌన్సిలర్లు
● మాజీ మున్సిపల్ చైర్మన్ అంకయ్య కూడా
● కండువాలు కప్పి ఆహ్వానించిన చంద్రబాబు


టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్న మాజీ మున్సిపల్ చైర్మన్ అంకయ్య

పుత్తూరు అర్బన్, మార్చి 27: పుత్తూరు మున్సిపాలిటీలో వైసీపీకి షాక్ తగిలింది. ఇద్దరు మున్సిపల్ కౌన్సిలర్లుతో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ టీడీపీలో చేరారు. బుధ వారం టీడీపీ అధినేత చంద్రబాబు పుత్తూరు పర్య టనలో భాగంగా 17వ వార్డు కౌన్సిలర్ భువనేశ్వరి, 11వ వార్డు కౌన్సిలర్ జాన్ కెనడీతో పాటు వైసీపీ నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ అంకయ్య, రిటైర్డ్ టీచర్, అంబేడ్కర్ ట్రస్ట్ భవన్ కోశాధికారి, గత ఎన్నికల్లో వైసీపీ విజయా నికి కృషి చేసిన కుప్పయ్య గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరికి చిన్నరాజుకుప్పం హెలీప్యాడ్ వద్ద చంద్రబా బు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఇద్దరు కౌన్సిలర్లు, మరో ఇద్దరు ప్రముఖులు టీడీపీ తీర్థం పుచ్చుకోవడం పుత్తూరు వైసీపీలో అలజడి రేగింది.

ఎండను లెక్క చేయని కార్యకర్త

పుత్తూరు అర్బన్, మార్చి 27: ప్రజాగళం రోడ్‌షో సమయంలో ఎండ తారెత్తించింది. అయినప్పటికీ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున సభకు హాజరయ్యారు. పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో వాహనాలను దూరంగా నిలిపి ఎండలో నడుచుకుంటూ సభ జరిగే కాపువీధి జంక్షన్‌కు చేరుకున్నారు. ముందస్తుగా కేఎన్ రోడ్డులో వివిధ చోట్ల మజ్జిగ ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లను గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో పుత్తూరు నాయకులు సిద్ధం చేసి ఉంచారు. మండు టెండలో వచ్చిన కార్యకర్తలకు నీళ్లను పంపిణీ చేశారు.

వైసీపీకి ఓటేస్తే మీ ఆస్తులు కూడా దోచేస్తారు: టీడీపీ


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న లక్ష్మీ సాయి ప్రియ

వెంకటగిరి, మార్చి 27 : పొరపాటున మళ్లీ వైసీపీకి ఓటు వేస్తే ఈ సారి మీ ఆస్తులు కూడా దోచేస్తారని వెంకటగిరి టీడీపీ అభ్యర్థి లక్ష్మీ సాయిప్రియ హెచ్చరిం చారు. బుధవారం ఆమె పట్టణంలోని 3వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. ఇంటింటికీ వెళ్లి మీ ఇంటి బిడ్డగా తనను ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. వెంకటగిరిలో ఐదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. తన తండ్రి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఎమ్మెల్యేగా వెంకటగిరిని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. నియోజకవర్గంపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. ఏ గ్రామానికి ఏం కావాలో తెలుసుకొన్నట్లు వివరించారు. నాన్న హయాంలో ఆగిపోయిన పనులన్నింటినీ తిరిగి మొదలు పెడతామన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పించను రూ.4వేలు ఇంటికే తెచ్చి ఇస్తామని వివరించారు. చేనేత కార్మికుల కష్టాలు తొలిగించే బాధ్యతను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

●ప్రచారంలో తండ్రీకూతుళ్ల దూకుడు

ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి లక్ష్మీ సాయి ప్రియ, ఆమె తండ్రి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దూకుడు పెంచారు. ఆయన బుధవారం పట్టణంలోని 10వ వార్డులో పర్యటించి తన కుమార్తె లక్ష్మీ సాయిప్రియను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వారి వెంట నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, చంద్రారెడ్డి, పునుగోటి విశ్వనాథనాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు. గురువేంద్రనాయుడు, చలపతి, అవ్వారు సత్యనారాయణ, గంగాధర్, క్లస్టర్ ఇన్‌చార్జీలు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో దళితుల ఊచకోత: నెలవల


సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, మార్చి 27 : వైసీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా దళితులు ఊచకోతకు గురయ్యారని టీడీపీ సూళ్లూరుపేట ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం విమర్శించారు. మండలంలోని చెంబేడు గ్రామంలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో బుధవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీమంత్రి పరసారత్నం, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ తదితర నేతలకు ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 30 మంది దళితులు వైసీపీ హయాంలో ఊచకోతకు గురయ్యారని తెలిపారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబుకి వైసీపీ ప్రభుత్వం కొమ్ముకాసిందన్నారు. డాక్టర్ సుధాకర్ తదితర దళితులు వైసీపీ అరాచకాలకు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అదే టీడీపీ పాలనలో అనేక మంది దళితులకు అనేక ఇన్నోవా కార్లు, 25 వేల ట్రాక్టర్లు పంపిణీ చేశారని గుర్తుచేశారు. చిరు వ్యాపారాలు చేసుకోవడానికి చంద్రబాబు ప్రత్యేకంగా నిధులు అందజేశారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్ నాయుడు, మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నాయ కులు దామెర ప్రసాద్‌నాయుడు, పేరం మధుసూదన్‌నాయుడు, మరుపూరు మస్తాన్‌రెడ్డి, మల్లిరెడ్డి, నెలవల రాజేష్, దార్ల రాజేంద్ర, వేలూరు రమణయ్య, జనసేన మండల అధ్యక్షుడు మల్లాం విజయ్, మునీంద్ర, రాఘ వయ్య, బాలాజీ, వెంకటసుబ్బయ్య, మోహన్ నాయుడు, నరేంద్ర, యాళ్ల యుగంధర్, ఉచ్చూరు వెంకటయ్య, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

తడ, మార్చి 27 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో బీఎల్‌వోలు, సూపర్ వైజర్లు, సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, ఇతర మౌళిక వసతులపై దృష్టి పెట్టాల న్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా అధికారులు పని చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏవో మురళీకృష్ణ, ఎంఈవో మల్లికార్జున, డిప్యూటీ తహసీల్దారు శరత్‌బాబు, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ, పలువురు అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక


వైసీపీ కార్యకర్తలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ

డక్కిలి, మార్చి 27 : డక్కిలి మండలం కందలవారిపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు బుధవారం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ ఆయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నామినేషన్ల నాటికి వైసీపీ ఖాళీ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, చెలికం భాస్కరరెడ్డి, దందవోలు పెంచలరెడ్డి, పిల్లి శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

టీడీపీ రాగానే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం


ప్రచారం నిర్వహిస్తున్న లక్ష్మీ సాయిప్రియ

బాలాయపల్లి, మార్చి27: టీడీపీ రాగానే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని ఆ పార్టీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయి ప్రియ తెలిపారు. వెంకటగిరి అభ్యర్థిగా ప్రకటించాక బాలాయపల్లి మండలంలోని సుబ్రమణ్యం అనే గ్రామానికి విచ్చేశారు. తొలి సారి మండలానికి వచ్చిన ఆమెకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ నుంచి ర్యాలీగా సుబ్రమణ్యస్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణంతో పాటు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. పించను రూ.4వేలు ఇంటి వద్దకే తీసుకొచ్చి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడు, రాయి సత్యం నాయుడు, కూను శ్రీహరి, సీసీ నాయుడు, సీవీకే నాయుడు, కొర్రపాటి రామచంద్ర నాయుడు, మారెళ్ల వెంకటాద్రి, వల్లెపు ఈశ్వర్, గుండుబోయిన గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే చర్యలు

నాయుడుపేట టౌన్, మార్చి 27 : ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు కళ్యాణి హెచ్చరించారు. తన కార్యాలయంలో బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టార్ ఆఫీసర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నాయుడుపేట అర్బన్ పరిధిలో 37, రూరల్‌లో 37 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్క అధికారీ కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ గోపీ, ఎంపీడీవో ప్రేమ్‌రాజ్, డిప్యూటీ తహసీల్దారు రాజేంద్ర ఉన్నారు.

చంద్రబాబుకు సాదర వీడ్కోలు


చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మార్చి 27: ప్రజాగళం రోడ్‌షోలో పాల్గొనేందుకు పుత్తూరుకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబుకు బుధవారం ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. చిన్నరాజుకుప్పం వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకున్న చంద్రబాబుకు భానుప్రకాష్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. రోడ్‌షో అనంతరం తిరుగు ప్రయాణంలో భాగంగా హెలీప్యాడ్ వద్ద వీడ్కోలు పలికారు.

శెభాష్ భాను....

ప్రజాగళం రోడ్‌షో, సభ విజయవంతం కావడం పట్లగాలి భానుప్రకాష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తిరుగుప్రయాణంలో హెలీప్యాడ్ వద్ద భుజంతట్టి అభినందించారు. ఇదే ఉత్సాహంతో ఎన్నికలను ఎదుర్కొని విజయం సాధించాలని సూచించారు. తన ప్రసంగంలో సైతం గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని, ఆయన తండ్రి ముద్దుకృష్ణమనాయుడు వలే భాను పేదల పక్షాన ఉంటూ, వారికి అండగా నిలుస్తారని చెప్పారు.

మంచి భవిష్యత్తు కోసం బాబు సీఎం కావాలి : భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మార్చి 27: మనందరి భవిష్యత్తు బాగుపడాలంటే చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని కాపువీధి జంక్షన్ వద్ద నిర్వహించిన ప్రజాగళం రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు. నగరిలో అరాచక, అవినీతి, దోపిడీ పాలన అంతం కావాలంటే సైకిల్‌కు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. చంద్రబాబును సీఎం చేసుకునేందుకు నియోజకవర్గ ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు.

నగరిలో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేస్తాం...

టీడీపీ అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న చేనేత, పవర్‌లూమ్స్ రంగం పూర్వవైభవం సాధించేందుకు నగరిలో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేస్తామని చిత్తూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ప్రసాద్ స్పష్టం చేశారు. తనకు నియోజకవర్గ సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉందన్నారు. రైతులకు నింద్ర షుగర్ ఫ్యాక్టరీ నుంచి రావాల్సిన బకాయిలను ఇప్పిస్తామని ప్రకటిం చారు. వ్యవసాయానికి, రైతులకు అండగా ఉంటామని తేల్చి చెప్పారు. చంద్రబాబు మంచి పాలనా దక్షతతో నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు. ఎమ్మెల్యేగా గాలి భాను ప్రకాష్‌ను, చిత్తూరు పార్లమెంట్ ఎంపీగా తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

భువనేశ్వరికి అండగా ఉందాం...

చంద్రబాబు తన ప్రసంగంలో నగరి ఎమ్మెల్యే అవినీతి గురించి ప్రస్తావిస్తూ 'మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తానని కౌన్సిలర్ భువనేశ్వరి వద్ద నుంచి రూ.40 లక్షలు వసూలు చేసి మోసం చేసింది' అంటూ భువనేశ్వరిని ముందుకు రావాలని పిలిపించారు. మోసపోయిన ఆమెకు అండగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు.



చంద్రబాబుతో కౌన్సిలర్ భువనేశ్వరి, అంబేడ్కర్ ట్రస్ట్ భవన్ కోశాధికారి కుప్పయ్య


చంద్రబాబుకు మరమగ్గాన్ని అందిస్తున్న గంజి మాధవయ్య

చంద్రబాబు సభ హైలెట్స్

● చంద్రబాబు సభావేదిక మీదకు రాగానే నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆయనకు కరవాలం (కత్తి) బహూకరించారు. చంద్రబాబు కత్తిని దూసి యుద్ధానికి సిద్ధమని సింబాలిక్‌గా చూపారు. దీంతో కార్యకర్తల ఈలలు, కేకలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది.

● గాలి భానుప్రకాష్ తన ప్రసంగంలో చంద్రబాబును తన రాజకీయ గురువుగా సంబోధించారు.

● నగరి సమస్యలను ప్రస్తావిస్తూ స్వర్గీయ ముద్దుకృష్ణమనాయుడును చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. నియోజకవర్గ సమస్యలపై తనతో ముద్దుకృష్ణమనాయుడు చర్చించిన రోజులను గుర్తు చేసుకుంటూ ఆయనకు నివాళులర్పించారు. అలాగే ముద్దుకృష్ణమను మిత్రుడిగా సంబోధించారు.

● గాలి భానుప్రకాష్‌ను ముద్దుకృష్ణమనాయుడు అంత నాయకుడిగా తీర్చిదిద్దే బాధ్యత తాను తీసుకుంటానని చంద్రబాబు చెప్పడంతో సభా ప్రాంగణంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. గాలి భానుప్రకాష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపించాలని పిలుపునిచ్చారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు సాదర వీడ్కోలు



తిరుపతి విమానాశ్రయంలో చీఫ్ జస్టిస్ దంపతులకు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

రేణిగుంట, మార్చి 27: భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచుడ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో అధికారులు సాదర వీడ్కోలు పలికారు. శ్రీవారిని కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్న ఆయన బుధవారం తిరుగు ప్రయాణం అయ్యారు. ఆయనకు విమానాశ్రయంలో సుప్రీంకోర్టు రిజిస్టర్ రాకేష్‌కుమార్ కులకర్ణి, ఏపీ హైకోర్టు రిజిస్టర్ జనరల్ లక్ష్మణరావు, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి భీమారావు, తిరుపతి త్రాడ్ ఏడీజె గురునాథ్ తదితరులు వీడ్కోలు పలికారు.

ముక్కంటి సేవలో హైకోర్టు చీఫ్ జస్టిస్



హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు స్వామి అమ్మవార్ల చిత్రపటం అందజేస్తున్న ఈవో నాగేశ్వరరావు

శ్రీకాళహస్తి, మార్చి 27: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ శ్రీకాళహస్తీశ్వర స్వామిని బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవో నాగేశ్వరరావు వారికి దక్షిణ గాలిగోపురం వద్ద స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వదించారు. అనంతరం ఈవో నాగేశ్వరరావు స్వామి అమ్మవార్ల చిత్రపటం, తీర్థ ప్రసాదాలను చీఫ్ జస్టిస్ దంపతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక న్యాయమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో రీయూనియన్ ఐలాండ్ బృందం



బృందానికి శ్రీసిటీ గురించి వివరిస్తున్న ప్రతినిధులు

శ్రీసిటీ, మార్చి 27: ఫ్రాన్స్ పరిధిలోని రీయూనియన్ ఐలాండ్‌కు చెందిన ప్రభుత్వ ప్రతినిధుల బృందం బుధవారం శ్రీసిటీని సందర్శించింది. బృందంలోని రీ యూనియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇడస్ట్రీ(సీసీఐ) సెక్రటరీ రిచర్డ్ బౌకి క్వీని, ప్రెసిడెంట్ జానీ అర్నాచెల్లమ్, రీయూనియన్ ఐలాండ్ డిప్యూటీ మేయర్ బెర్నార్డ్ రాబర్ట్, ఫ్రాన్స్‌లోని గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆఫ్ పీపుల్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ డైరెక్టర్ రాజారామ్, మోహన్, మునస్వామి, సదరన్ ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎస్ఐసీసీఐ) మేనేజర్ భవాని సమ్మారావులకు శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్(మార్కెటింగ్) శివశంకర్ స్వాగతం పలికి, పారిశ్రామిక నగరం, ప్రగతి ప్రత్యేకతలు, వ్యాపారానుకూల పర్యావరణ వ్యవస్థ గురించి వివరించారు. అనంతరం శ్రీసిటీ పరిసరాలతో పాటు రాక్‌వ్రేర్ పరిశ్రమను వారు సందర్శించారు. శ్రీసిటీ మౌలిక సదుపాయాలు, పరిశ్రమల అనుకూల వాతావరణం తమను ఎంతగానో ఆకట్టుకుందన్న ప్రతినిధులు, భారీ పారిశ్రామికవాడ అభివృద్ధి చేయడంలో శ్రీసిటీ యాజమాన్యం కృషిని అభినందించారు.

ఫలించిన ఎమ్మెల్యే ప్రయత్నం

● విరోధులను ఏకతాటిపైకి తెచ్చిన ఆదిమూలం



తిరుమలరెడ్డి, ఇళంగోవన్‌రెడ్డితో ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, మార్చి 27: గత పదేళ్లుగా ఒకరంటే ఒకరికి పడదు అంతకు ముందు ఇద్దరూ మంచి స్నేహితులు.. అయితే రాజకీయ విబేధాల కారణంగా విడిపోయిన వారిద్దరూ బద్ధ శత్రువులుగా మారారు. దీంతో పార్టీ శ్రేణులు సైతం రెండు వర్గాలుగా విడిపోయారు. అయితే ఆదిమూలం రాజకీయ చతురతతో బుధవారం ఆ ఇద్దరిని కలిపి మళ్లీ స్నేహాన్ని పునరుద్ధరించారు. వివరాలిలా... పిచ్చాటూరు మాజీ టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు, ప్రస్తుత క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, ప్రస్తుత టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఒకే సామాజిక వర్గానికి చెందిన వారైనప్పటికీ ఉత్తర, దక్షిణ ధృవాలుగా ఉండేవారు. వీరిద్దరిని కలపడం కోసం గతంలో జేడీ రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే హేమలత, ఇన్‌చార్జి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అయితే ఎమ్మెల్యే ఆదిమూలం మాత్రం పట్టు విడవని విక్రమార్కుడిలా బుధవారం చేసిన ప్రయత్నం ఫలించడంతో వారిద్దరు మళ్లీ కలసి మిమ్మల్ని గెలిపించే బాధ్యత మాది అని హామీ ఇవ్వడంతో పార్టీ శ్రేణులు సైతం ఆనందంలో మునిగిపోయారు.

సత్యవేడుపై పెద్దిరెడ్డి పెత్తనం ఏంటి ? : ఆదిమూలం

సత్యవేడు నియోజకవర్గంపై పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెత్తనం ఏంటని ఎమ్మెల్యే ఆదిమూలం మండిపడ్డారు. బుధవారం పిచ్చాటూరు టీడీపీ కార్యాలయం ఆవరణలో జయహో బీసీ సభ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు టీడీపీ ఆవిర్భావంతోనే గుర్తింపు లభించిందన్నారు. పెద్దిరెడ్డి లేనిదే సత్యవేడులో అభ్యర్థులు గెలవరంట అదే నిజమైతే టీడీపీ నుంచి తలారి మనోహర్, సురాజ్, శివప్రసాద్, హేమలత, తలారి ఆదిత్య ఎలా గెలిచారని ప్రశ్నించారు. సత్యవేడులో ఆదిమూలాన్ని ఓడిస్తానని పెద్దిరెడ్డి ప్రగల్భాలు పలకడం మానుకోవాలని, గెలుపోటములు నిర్ణయించేది ఓటర్లు అనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. తెలిసో తెలియకో నా వల్ల ఎక్కడైనా టీడీపీ శ్రేణులకు అన్యాయం జరిగి ఉంటే దాన్ని నేను సరి చేసుకుంటాను నన్ను క్షమించండి అని ప్రాధేయపడ్డారు. కార్యక్రమంలో ఇళంగోవన్‌రెడ్డి, బీసీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



పాలిటెక్నిక్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

సత్యవేడు, మార్చి 27: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈవీఎంలను భద్రపరిచే గదులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. లక్ష్మీశ బుధవారం పరిశీలించారు. సత్యవేడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నరసింహులతో కలసి ఆయన ఈవీఎంలను భద్రపరిచే గదులతో పాటు పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పార్లమెంట్, రెండు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎం స్ట్రాంగ్ గదుల్లో వేసిన నెంబర్లను పరిశీలించడంతోపాటు లోపల కిటికీలు కనిపించకుండా పూర్తిగా మూసి వేయాలని అధికారులను ఆదేశించి పలు సూచనలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో బాలికల గురుకుల కళాశాల ప్రాంగణంలో కూడా కలెక్టర్ పరిశీలించారు. అంతకు ముందు మార్గమధ్యంలో దాసుకుప్పం, మదనంబేడు తదితర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాలను ఆరా తీశారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్, సహాయ ఎన్నికల అధికారి రామాంజనేయులు, రెవెన్యూ డీటీ రవిచంద్రబాబు, ఎంపీడీవో చంద్రశేఖర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, ఆర్ఐ కిరణ్‌కుమార్, వీఆర్వో సురేష్, వ్యవసాయ శాఖ ఏవో మురళి, మదనంబేడు, పంచాయతీ సెక్రటరీ మాధవి, వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జిగా వినుత కొనసాగింపు



నియామక పత్రం అందుకుంటున్న వినుత

శ్రీకాళహస్తి, మార్చి 27: శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి వినుతను కొనసాగిస్తూ ఆపార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నియామక పత్రాన్ని అందజేశారు. బుధవారం మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో అధినేత పవన్ కళ్యాణ్‌తో వినుత భేటీ అయ్యారు. ఆమెను తిరిగి ఇంచార్జిగా కొనసాగిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఆర్వో, అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 27: మండలంలోని నీర్పాకోట, కనమనంబేడు, బీఎన్‌కండ్రిగ, గ్రామాల్లోని ఉన్న పోలింగ్ బూత్‌లను సత్యవేడు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి కెపి.నరసింహులు బుధవారం పరిశీలించారు. మేలో జరుగనున్న ఎన్నికలలో ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ అలీఖాన్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు, బీఎల్వోలు పాల్గొన్నారు.

చెప్పుల దొంగకు దేహశుద్ధి



సెక్యూరిటీ అదుపులో ఉన్న యువకుడు

శ్రీకాళహస్తి, మార్చి 27: చెప్పుల దొంగకు భక్తులు దేహ శుద్ధి చేసిన ఘటన బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయం నాలుగో గేటు వద్ద చోటు చేసుకుంది. తెలంగాణ ప్రాంతానికి చెందిన కొందరు భక్తులు ఆలయ 4వ గేటు పార్కింగ్ ప్రదేశంలో చెప్పులు వదిలి దర్శనానికి బయలుదేరారు. వారు కొంత దూరంలో ఉండగానే ఓ యువకుడు ఆ చెప్పులను అపహరించబోయాడు. ఇది గమనించిన భక్తులు యువకుడిని నిలదీశారు. చెప్పులు తీసుకోబోయిన యువకుడు దురుసుగా సమాధానం చెప్పడంతో భక్తులు దేహశుద్ధి చేశారు. ఆలయ భద్రతా సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. అందరి కళ్ళు కప్పి యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు.

టీడీపీతోనే మహిళా సాధికారత



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జల రిషితా రెడ్డి

శ్రీకాళహస్తి/తొట్టంబేడు, మార్చి 27: టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని 3వ క్లస్టర్ పరిధిలో బుధవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక మహిళలతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రిషితా రెడ్డి మాట్లాడుతూ... మహిళల కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని వివరించారు. ప్రస్తుత వైసీపీ పాలనలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే మహిళల అభివృద్ధి కోసం సీఎంగా చంద్రబాబు ప్రత్యేక పథకాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తెలుగు మహిళా పట్టణ అధ్యక్షురాలు సుమతి, యూనిట్ ఇంచార్జి హేమంత్ కుమార్, పార్టీ పట్టణ కార్యదర్శి కాసరం రమేష్, నాయకులు మీర్జా పాల్గొన్నారు.

బీసీల ఆత్మగౌరవం టీడీపీతోనేనని శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలంలోని జ్ఞానమ్మకండ్రిగ గ్రామంలో మండలంలోని బీసీలతో ఆత్మీయసమావేశం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, మండల టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, రేణుకమ్మ, చలపతి, రాఘవులు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న జడ్పీటీసీ తిరుమలయ్య

ఏర్పేడు, మార్చి 27: టీడీపీ అధికారంలోకి వస్తేనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి సాధ్యమని ఏర్పేడు జడ్పీటీసీ కావేరి తిరుమలయ్య అన్నారు. ఏర్పేడు మండలం కందాడరు పంచాయతీలో శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్సీ సాధికార సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలయ్య మాట్లాడుతూ టీడీపీతోనే ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి సాధ్యమని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద అనేక సంక్షేమ పథకాలను అందించినట్లు గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావాలని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు టీడీపీ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నైనారు పొన్నారావు, క్లస్టర్ ఇన్‌చార్జి నాగరాజునాయుడు, నాయకులు సతీష్‌నాయుడు, మనోహన్‌రాయుడు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన మాజీ ఎమ్మెల్యేలు



చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, మునిరామయ్య

శ్రీకాళహస్తి, మార్చి 27: టీడీపీ అధినేత చంద్రబాబును కలిసినట్లు శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం కుప్పం పర్యటనలో భాగం గా చంద్రబాబును కలిసి చర్చించినట్లు వెల్లడించారు. తమ రాజకీయ భవిష్యత్తుకు అధినేత చంద్రబాబు భరోసా ఇచ్చారని తెలిపారు. అలాగే శ్రీకాళహస్తి సభలో తమ భవిష్యత్తుపై చంద్రబాబు బహిరంగంగా ప్రకటన చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

నీటి పొదుపును పాటిద్దాం



మాట్లాడుతున్న కమిషనర్ రమేష్‌బాబు

శ్రీకాళహస్తి, మార్చి 27: భవిష్యత్తుపై అవగాహనతో అందరూ నీటి పొదుపు పాటించాలని శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని కార్యాలయంలో బుధవారం నీటి పొదుపు పై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రానున్న మూడు నెలలు నీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉం టుందన్నారు. శ్రీకాళహస్తి ప్రజలందరూ ఎక్కడా నీటి వృధా జరగకుండా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి పట్టణ పరిధిలో చేతి బోర్లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఎక్కడైనా నీటి సమస్య ఎదురైతే మున్సిపల్ అధికారులను సంప్రదించాలని కోరారు.

పోలేరమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, మార్చి 27: శ్రీకాళహస్తి మండలం వెల్లంపాడు గ్రామంలో వెలసిన పోలేరమ్మ గ్రామ దేవతకు ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు బుధవారం పట్టు వస్త్రాలు సమర్పించారు. పోలేరమ్మ జాతర వేడుకను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రఘునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాకుంభాభిషేకం



శిఖరంపై పూజలు - కలశ జలాలను తీసుకెళ్తున్న పండితులు

వరదయ్యపాళెం, మార్చి 27: మండలంలోని సీఎల్ఎం.పల్లెలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మహాకుంభాభిషేకం రుత్వికుల వేద మంత్రోచ్ఛరణ మధ్య నిర్వహించారు. సుప్రభాత సేవ, ఆరో కాల హోమాలు, తత్వహోమం, మూలమూర్తి హోమం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం మహాకుంభాభిషేకం, ప్రాణప్రతిష్ఠ, నైవేద్యం, విశ్వరూప దర్శనం జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, రాత్రి గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు యన్నం విజయభాస్కర్, యన్నం త్యాగరాయం, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కేంద్రంలో పనిచేయని లిఫ్ట్

● భక్తులకు తప్పని అవస్థలు



వేడి అన్నం పాత్ర మోసుకుని వస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, మార్చి 27: ముక్కంటి ఆలయ అన్నదాన కేంద్రంలో లిఫ్ట్ పని చేయకపోవడంతో భక్తులకు అవస్థలు తప్పడం లేదు. నెలరోజుల క్రితం అన్నదాన కేంద్రంలో లిఫ్ట్ మరమ్మతులకు గురైంది. కింద వంటశాల నుంచి మొదటి అంతస్తులోకి వేడిగా ఉన్న భోజనం పాత్రలు పంపాల్సి ఉంటుంది. లిఫ్ట్ బాగు చేయడంపై ఎవరు దృష్టి పెట్టకపోవడంతో నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. వంటశాల సిబ్బందితోపాటు అన్న ప్రసాదం స్వీకరించేందుకు వచ్చిన భక్తులు పాత్రలను మిద్దె పైకి మోయాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి నిర్లక్ష్య వైఖరి వీడాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

లారీని ఢీకొన్న కారు

● తృటిలో తప్పిన ముప్పు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

శ్రీకాళహస్తి, మార్చి 27: ముందు వెళ్తున్న సిమెంటు లారీని వెనుక వస్తున్న కారు అదుపుతప్పి ఢీకొంది. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివారులోని హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద బుధవారం నాయుడుపేట జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. తమిళనాడు ప్రాంతం వేలూరుకు చెందిన ఓ కుటుంబం కారులో శ్రీకాళహస్తి వచ్చారు. ముక్కంటి దర్శనానంతరం తిరిగి ఆరణికి బయలుదేరారు. హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద కోడాడ నుంచి తమిళనాడు రాష్ట్రం రాణిపేటకు వెళుతున్న సిమెంటు లారీని వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ఘటనలో రెండేళ్ల చిన్నారి స్వల్పంగా గాయపడగా, పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోండి



కేంద్ర బలగాలతో కవాతు

వరదయ్యపాళెం, మార్చి 27: ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని శ్రీసిటీ డీఎస్పీ వైడేశ్వరరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం బీఎస్ఎఫ్ సిబ్బందితో కలిసి డీఎస్పీ ఆధ్వర్యంలో వీకేఆర్‌వై కాలనీ, చిన్నపాండూరు, రాచర్ల హరిజనవాడ, వడ్డిపాళెం, పాదిరికుప్పం తదిర గ్రామాల్లో కవాతు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ భాస్కర్, ఎస్ఐ గోస్‌పీర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తొట్టంబేడు, మార్చి 27: మండలంలోని కొత్తకండ్రిగ, జ్ఞానమ్మకండ్రిగ గ్రామాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తమ సిబ్బందితోకలిసి పరిశీలించారు. అనంతరం ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహణ కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ తరుణాక్షిరెడ్డి, వీఆర్వోలు, పంచాయతీ సెకరట్రీలు పాల్గొన్నారు.

అగ్నిమాపక శాఖకు ఐమాప్ పరిశ్రమ వితరణ

● రూ.2.75 లక్షల విలువైన పరికరాల పంపిణీ



అగ్నిమాపక శాఖ అధికారికి పరికరాలు అందజేస్తున్న ఐఎంవోపీ ఎండీ

శ్రీసిటీ, మార్చి 27: శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్(ఐఎంవోపీ-ఐమాప్) పరిశ్రమ, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)లో భాగంగా అగ్నిమాపక శాఖకు విపత్తులను ఎదుర్కొనేందుకు అవసరమైన పలు పరికరాలను వితరణగా ఇచ్చింది. జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫైర్ ఆఫీసర్ అభ్యర్థన మేరకు పవర్ రంపాలు, జనరేటర్‌తోపాటు రూ.2.75 లక్షల విలువైన పలు పరికరాలను విరాళంగా అందజేశారు. శ్రీసిటీ అగ్నిమాపక కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఐఎంవోపీ మేనేజింగ్ డైరెక్టర్ తైజో ఇవామీ చేతుల మీదుగా జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్యకు పరికరాలను అందించారు. ఐమాప్ అసిస్టెంట్ ఎండీ హిరోకి ఇమై, సీనియర్ టెక్నికల్ అడ్వయిజర్ తానెగావా, హరిహరన్, శ్రీసిటీ ప్రతినిధులు రమేష్‌కుమార్, వై.రమేష్ భగవాన్, సురేంద్రకుమార్, శ్రీసిటీ ఇన్‌చార్జి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాలకృష్ణాపురంలో లో ఓల్టేజీ సమస్య

● కాలిపోతున్న మోటార్లు
● ఎండిపోతున్న పంటలు



నీరందక ఎండుతున్న వరిపంట

సత్యవేడు, మార్చి 27: మండలంలోని బాలకృష్ణాపురంలో లో ఓల్టేజీ సమస్యతో వ్యవసాయ మోటార్లు కాలిపోతుండడంతో రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పంటలకు నీరందక ఎండబెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. బాలకృష్ణాపురం గ్రామంలో ప్రస్తుతం వందెకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. అయితే ఇక్కడ లో ఓల్టేజీ విద్యుత్ సమస్య తలెత్తడంతో వ్యవసాయ మోటార్లు తరచూ కాలిపోతున్నాయి. పంటలకు నీటిని అందించేందుకు మోటార్లు ఆన్ చేయగానే లో ఓల్టేజీ వల్ల మోటార్లు కాలిపోతున్నాయని బాధిత రైతులు సుధాకర్‌నాయుడు, ఆంథోని, వతరథన్, తిరుమలైఆచారి తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ విద్యుత్ మోటార్లు దగ్ధం కావడం వల్ల సకాలంలో పంటలకు నీటిని అందించలేక పోతున్నామని రైతుల వాపోతున్నారు. దీన్ని గుర్తించి ప్రస్తుతం బాలకృష్ణాపురం గ్రామంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, అలాగే 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న చోట అదనంగా మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఇదే తరహాలో మండలంలోని ఎన్ఆర్ అగ్రహారం, రాచపాళెం, చిన్న ఈటిపాకం, సత్యవేడు తదితర ప్రాంతాల్లో కూడా లో ఓల్టేజీ సమస్యను ఎదుర్కొంటున్నట్టు రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి లో ఓల్టేజీ విద్యుత్ సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవడంతో పాటు సాగులో ఉన్న పంటలు ఎండి పోకుండా కాపాడాలని రైతులు కోరుతున్నారు.